



సాయినాథ్ ప్రభాకర్ విష్ణురఘువీర్

చిత్తూరు డీఎస్పీగా సాయినాథ్

● పలమనేరుకు ప్రభాకర్ ● ఎస్సీ ఎస్టీ సెల్ డీఎస్పీ బదిలీ

చిత్తూరు, ఆగస్టు 21: జిల్లాకు ఇద్దరు కొత్త డీఎస్పీలు నియమితులయ్యారు. చిత్తూరుకు సాయినాథ్, పలమనేరుకు ప్రభాకర్‌ను నియమిస్తూ డీజీపీ ద్వారకా తిరుమలరావు తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే చిత్తూరు ఎస్సీ ఎస్టీ సెల్ డీఎస్పీ విష్ణు రఘువీర్‌ను కాకినాడకు బదిలీ చేశారు. ఎన్నికల ముందు చిత్తూరుకు వచ్చిన డీఎస్పీ రాజగోపాల్ రెడ్డి వైసీపీకి అనుకూలంగా పనిచేశారనే ఆరోపణల నేపథ్యంలో ప్రభుత్వం ఇటీవల పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో రిపోర్టు చేసుకోవాలని ఆదేశాలిచ్చింది. నెల్లూరు మహిళా స్టేషన్ డీఎస్పీగా ఉన్న సాయినాథ్‌ను చిత్తూరు డీఎస్పీగా బదిలీ చేశారు. రాజమండ్రి స్పెషల్ బ్రాంచి డీఎస్పీగా ఉన్న ప్రభాకర్‌ను పలమనేరు డీఎస్పీగా మార్చారు. ఎన్నికల సమయంలో ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారనే కారణంగా అప్పటి పలమనేరు డీఎస్పీ మహేశ్వర్‌రెడ్డిని ఎన్నికల సంఘం బదిలీ చేసింది. మే 15 నుంచి చిత్తూరు ఎస్సీ ఎస్టీ సెల్ డీఎస్పీ విష్ణు రఘువీర్ ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్నారు. తాజాగా జరిగిన బదిలీల్లో విష్ణురఘువీర్‌ను కాకినాడ డీఎస్పీగా బదిలీ చేశారు. విష్ణు రఘువీర్ 1991 ఎస్ఐ బ్యాచ్‌కు చెందిన అధికారి కాగా.. కొత్తగా వచ్చిన డీఎస్పీలు 1995 బ్యాచ్‌వారు.

బంద్ పాక్షికం



చిత్తూరు ఆర్టీసీ బస్టాండ్ వద్ద ధర్నా చేస్తున్న దళిత సంఘాల నేతలు

చిత్తూరు, ఆగస్టు 21: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ మాల మహానాడు ఆధ్వర్యంలో బుధవారం చేపట్టిన భారత్ బంద్ జిల్లాలో పాక్షికంగా జరిగింది. జిల్లావ్యాప్తంగా మాలమహానాడు నేతలు రాస్తారోలు నిర్వహించారు. 'వర్గీకరణ వద్దు.. కలసి ఉంటే కలదు సుఖము' అంటూ నినాదాలు చేశారు. కొన్నిచోట్ల పాఠశాలలు, కళాశాలలు, షాపులు మూయించారు. చిత్తూరు ఆర్టీసీ బస్టాండ్, ఆర్డీవో కార్యాలయాల వద్ద ధర్నా చేశారు. దర్గాసర్కిల్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. నాయకులు లోకనాథం, రాసనపల్లె ప్రకాష్, రాజ్‌కుమార్, ధనంజయరావులు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ ఆర్టికల్ 341కు వ్యతిరేకమన్నారు. ఏ ఆర్టికల్ ఆధారంగా వర్గీకరణ చెల్లదని సుప్రీం కోర్టు గతంలో చెప్పిందో అదే ఆర్టికల్ ప్రకారం ఇప్పుడు వర్గీకరణ చేయొచ్చని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే వర్గీకరణను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

గత వైసీపీ ప్రభుత్వ నిర్వాకం ఫలితంగా కుప్పం రెస్కో కోలుకోలేని ఆర్థిక కష్టాల్లో కూరుకుపోయింది. విద్యుత్తు కొనుగోళ్లలో ఇస్తున్న సబ్సిడీని జగన్‌రెడ్డి ప్రభుత్వం ఎత్తేసింది. ఫలితంగా ఎస్పీడీసీఎల్‌కు చెల్లించాల్సిన బకాయిలు ఏకంగా రూ.450 కోట్ల మేర పేరుకుపోయాయి. మరోవైపు అస్మదీయులకు విద్యుత్తు బిల్లులను ఉదారంగా తగ్గించి వేయడంతో మరో రూ.150 కోట్ల మేర వినియోగదారుల నుంచి రావాల్సిన బకాయిలు ఆగిపోయాయి.

- కుప్పం



● విద్యుత్తు కొనుగోలు సబ్సిడీ ఎత్తేసిన వైసీపీ ప్రభుత్వం
● ఎస్పీడీసీఎల్‌కు రూ.450 కోట్ల మేర పేరుకున్న బకాయిలు
● వినియోగదారుల నుంచి రావాల్సినవి రూ.150 కోట్లు
● 'ఎగ్జింప్షన్ ఫ్రమ్ లైసెన్సీ' అప్రూవ్ చేస్తేనే మనుగడ

ఆర్థిక కష్టాల్లో రెస్కో!

నేటి సీఎం, నాటి ప్రతిపక్ష నేత చంద్రబాబు నియోజకవర్గమైన కుప్పంపై గత వైసీపీ ప్రభుత్వం పూర్తిగా శీతకన్ను వేసింది. ఎంతో అభివృద్ధి చేస్తున్నామని ఊదరగొడుతూనే, వెనుక నుంచి గోతులు తవ్వింది. నియోజకవర్గ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యంతో ఏర్పడ్డ రెస్కోను నిర్వీర్యం చేసేందుకు కంకణం కట్టుకుంది. సాధారణంగా సహకార రంగంలో ఉన్న రెస్కో వంటి సంస్థకు ప్రభుత్వం తరపు నుంచి లభించే ప్రయోజనాల్లో భాగంగా 'ఎగ్జింప్షన్ ఫ్రమ్ లైసెన్సీ' అప్రూవ్ అయింది. అంటే ఎస్పీడీసీఎల్ విద్యుత్ కొనుగోళ్లలో సబ్సిడీ ఇస్తుందన్నమాట. ఇతర సంస్థలకు సరఫరా చేసేదానికన్నా రేటు తగ్గించి సరఫరా చేస్తోంది. ఉదాహరణకు రూ.10 యూనిట్ కాస్ట్ అనుకుంటే రెస్కోకు కేవలం ఒక్క రూపాయికే సరఫరా చేస్తుందన్నమాట. మిగిలిన ఆ 9 రూపాయలను ప్రభుత్వం ఎస్పీడీసీఎల్‌కు చెల్లిస్తుంది. దీంతో కుప్పం రెస్కో ఆర్థికంగా లాభపడకపోయినా నష్టాల్లో మాత్రం కూరుకుపోలేదు. కానీ వైసీపీ అధికారంలోకి రాగానే 'బటన్ నొక్కుళ్లకు' ఎక్కడలేని నిధులూ అవసరమయ్యాయి. అప్పులతో పాటు వివిధ సంస్థలకు ఇస్తున్న సబ్సిడీలు నిలిచిపోయాయి. ఈ క్రమంలో కుప్పం రెస్కోకు 'ఎగ్జింప్షన్ ఫ్రమ్ లైసెన్సీ' అప్రూవ్ చేయడం మానేసింది. దీంతో విద్యుత్తు కొనుగోళ్లలో సబ్సిడీ ఆగిపోయింది. ఫలితంగా ఎస్పీడీసీఎల్ నుంచి పూర్తి ధర చెల్లించి విద్యుత్తును కొనుగోలు చేయాల్సిన దుస్థితి దాపురించింది. ఎస్పీడీసీఎల్ యూనిట్ విద్యుత్తును రూ.6కు విక్రయిస్తోంది. 2022కు ముందు రెస్కోకు యూనిట్ విద్యుత్తు 40 పైసలకు మాత్రమే లభించేది. ప్రభుత్వం అనుమతి ఉపసంహరించుకోవడంతో పూర్తి ధర అంటే రూ.6 చెల్లించాల్సి వస్తోంది. ఫలితంగా ఎస్పీడీసీఎల్‌కు చెల్లించాల్సిన బకాయి భారం ఏకంగా రూ.450 కోట్లకు చేరింది. ఇప్పటికీ యూనిట్ విద్యుత్తుకు ఎప్పటిలా 40 పైసలు మాత్రమే చెల్లిస్తోంది కానీ, మిగిలిన రూ.5.40ను అరియర్స్‌గా ఎస్పీడీసీఎల్ లెక్కలు కడుతోంది. గతంలో అయితే ఈ మొత్తాన్ని ప్రభుత్వం చెల్లించేది.

గుక్కతిప్పుకోలేకపోతున్న వైనం

వైసీపీ ప్రభుత్వం తీసిన దొంగ దెబ్బవల్ల ఆర్థిక కష్టాల్లో కూరుకుపోయిన రెస్కో అందులోంచి కోలుకోవడానికి నానా ఇబ్బందులు పడుతోంది. టీడీపీ ప్రభుత్వం రాగానే వైసీపీ హయాంలో జరిగిన అక్రమ నియామకాలు, పదోన్నతులు, మెటీరియల్ కొనుగోళ్లలో పారదర్శకత పాటించకపోవడం, నాణ్యత లోపించడం వంటి వాటిపై విచారణ జరుపుతోంది. సత్వరం ముగించి బాధ్యులపై చర్యలు వేగవంతం చేస్తేనే వినియోగదారుల సమస్యలపై రెస్కో అధికారులు దృష్టిపెట్టగలరు. అదే సమయంలో వైసీపీ ప్రభుత్వం అప్రూవ్ చేయడం మానేసిన 'ఎగ్జింప్షన్ ఫ్రమ్ లైసెన్సీ'కి తిరిగి ప్రభుత్వం అనుమతులు ఇస్తే ఆర్థిక కష్టాలనుంచి కొంతలో కొంత కోలుకోగలుగుతుంది. అలాగే మొండి బకాయిలను రాబట్టాల్సిన అవసరం ఉంది.

● **పేరుకుపోయిన బకాయిలు**

కుప్పం రెస్కోలో విద్యుత్తు బకాయిలు రూ.కోట్లకు చేరాయి. వైసీపీ ప్రభుత్వ హయాంలో అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. ఉదాహరణకు అస్మదీయునికి చెందిన ఒక ఫ్యాక్టరీకి నెలకు రూ.40 వేలు బిల్లు వస్తే ఏడాదికి రూ.4.80 లక్షలు అవుతుంది. అప్పుడు అధికారులు, పాలకులు కలిసి పేరుకుపోయిన బకాయిలో ఉదారంగా ఒక లక్ష రూపాయలు కట్టనక్కరలేదని చెప్పేస్తారు. మిగిలిన రూ.3.80 వేలు మొత్తాన్ని ఆయన దఫదఫాలుగా చెల్లించుకోవచ్చు. మినహాయించిన లక్ష రూపాయలు బకాయిగా ఉండిపోతుంది. ఇటువంటి బకాయిలు పేరుకుని సుమారు రూ.150 కోట్లకు చేరింది.

విచారణ వాయిదా

కుప్పం, ఆగస్టు 21: కుప్పం రెస్కోలో అక్రమాలు, అవినీతిపై బుధవారం జరగాల్సిన విచారణ వాయిదా పడింది. సంస్థలో గత ప్రభుత్వ హయాంలో జరిగిన అక్రమాలపై చంద్రబాబు వ్యక్తిగత కార్యదర్శి పి.మనోహర్‌తోపాటు షణ్ముగం అనే వ్యక్తి ఫిర్యాదు మేరకు విచారణాధికారిగా ప్రభుత్వం సహకార సంఘాల అదనపు రిజిస్ట్రార్ కె.శ్రీలక్ష్మిని నియమించింది. ఆమె ఇప్పటికే రెండుసార్లు విచారణ జరిపి వెళ్లారు. మూడోమారు విచారణకు బుధవారం రావాల్సి ఉన్నా అనివార్యంగా ఒక సమావేశానికి హాజరు కావాల్సి ఉన్నందున రాలేకపోతున్నట్లు సమాచారం పంపినట్లు రెస్కో ఎండీ సోమశేఖర్ తెలిపారు. మరో వారం పది రోజుల్లో విచారణ ఉండే అవకాశముందని చెప్పారు.

● **ఉద్యోగులకు నోటీసులు**

రెస్కోలో అక్రమంగా నియామకాలు పొందినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న 121 మందిలో కారుణ్య నియామకాలు పొందిన ఆరుగురిని మినహాయించి మిగిలిన 115 మంది ఉద్యోగులకు బుధవారం ఎండీ సోమశేఖర్ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. నియామకాలు నిబంధనలకు అతీతంగా జరిగాయి కాబట్టి విధుల నుంచి ఎందుకు తొలగించకూడదో వివరణ ఇవ్వాలని ఈ నోటీసుల్లో పేర్కొన్నారు. నోటీసు అందుకున్న 15 రోజుల్లోపల వివరణ ఇవ్వాలని అందులో సూచించారు. అయితే సుమారు 10-15 ఏళ్ల క్రితమే ఉద్యోగాల్లో చేరి, పర్మినెంటు అయి, పదోన్నతులు కూడా పొందిన 17 మంది ఉద్యోగులను సైతం మిగతా వారిలో కలిపేసి నోటీసులు జారీ చేయడం విమర్శలకు తావిస్తోంది.

రెవెన్యూ బదిలీలకు కమిటీ

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 21: ఉమ్మడి జిల్లావ్యాప్తంగా రెవెన్యూ అధికారులు, ఉద్యోగుల బదిలీలకు కమిటీని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, సీనియర్ అసిస్టెంట్, మండల రెవెన్యూ అధికారి, టైపిస్టు, జూనియర్ అసిస్టెంట్, విలేజ్ రెవెన్యూ ఆఫీసర్ (గ్రేడ్-1, 2)ల బదిలీలకు కమిటీ అధ్యక్షుడిగా ఉమ్మడి చిత్తూరు జిల్లా నోడల్ అథారిటీగా ఉన్న కలెక్టర్ సుమిత్‌కుమార్, సభ్యుడిగా తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లు, చిత్తూరు జిల్లా రెవెన్యూ అధికారి పుల్లయ్య కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. చిత్తూరు జిల్లా పరిధిలో బదిలీలకు ఏర్పడిన కమిటీకి చైర్మన్‌గా కలెక్టర్, సభ్యుడిగా జేసీ, కన్వీనర్‌గా డీఆర్వో వ్యవహరిస్తారు. తహసీల్దార్, వీఆర్వోల బదిలీలు ఈ కమిటీ నిర్వహిస్తుంది. డిప్యూటీ తహసీల్దార్, సీనియర్ అసిస్టెంట్, ఎంఆర్ఐ, జూనియర్ అసిస్టెంట్లు, టైపిస్టుల బదిలీలకు జేసీ అధ్యక్షతన మరో కమిటీ ఏర్పాటైంది. ఈ కమిటీలో సభ్యులుగా డీఆర్వో, కలెక్టరేట్ పరిపాలనాధికారి ఉంటారు.

పంచాయతీల అభివృద్ధికి శ్రీకారం

● రేపు గ్రామ సభల నిర్వహణ


చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 21: గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. గ్రామ సభలు నిర్వహించి,ఉపాధి హామీ పథకం అనుసంధానంతో పనులు చేపట్టేందుకు అవసరమైన తీర్మానాలు చేసేందుకు నిర్ణయించింది. ఈ మేరకు శుక్రవారం ఉదయం9నుంచి సాయంత్రం 6గంటల వరకు అన్ని పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహిస్తారు. గ్రామాభివృద్ధికి అవసరమైన ప్రణాళికలపై చర్చిస్తారు. సభల్లో కనీసం 30శాతం మంది స్థానికులు పాల్గొనే విధంగా ప్రచారం చేస్తున్నారు.ఉపాధి హామీ పథకం అనుసంధానంతో చేపట్టాల్సిన పనులను ప్రజలతో చర్చించి,గ్రామసభ ఆమోదించే విధంగా పంచాయతీ కార్యదర్శులు చర్యలు తీసుకుంటున్నారు.చెత్త సంపద కేంద్రాలను వినియోగంలోకి తెచ్చేవిధంగా ప్రణాళికలు రూపొందిస్తారు.


రిజిస్ట్రేషన్ శాఖలో బదిలీల కసరత్తు

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 21: జిల్లావ్యాప్తంగా ఉన్న స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖలో సాధారణ బదిలీలకు కసరత్తు ప్రారంభమైంది. ఉద్యోగుల బదిలీలకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. సబ్ రిజిస్ట్రార్లు, సీనియర్ అసిస్టెంట్ల బదిలీలు ఉమ్మడి జిల్లాకు సంబంధించిన రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ చేస్తారు. జూనియర్ అసిస్టెంట్లు, క్లాస్-4 ఉద్యోగుల బదిలీలు జిల్లా రిజిస్ట్రార్ చేస్తారు. ఉద్యోగులు గురువారం లోగా బదిలీలకు సంబంధించి నివేదిక ఇవ్వాలని జిల్లా రిజిస్ట్రార్ శ్రీనివాసరావు తెలిపారు. ఐదేళ్ల పదవీకాలం ముగిసిన ఉద్యోగులు బదిలీలకు అర్హులని తెలిపారు. కోరుకున్న ప్రాంతాలను ఆప్షన్‌లో సూచించాలన్నారు. అలాగే మెడికల్, భార్య లేదా భర్త ఒకే ప్రాంతంలో పనిచేస్తున్న వారు సంబంధిత ధ్రువపత్రాలతో వినతిపత్రం అందజేయాలని కోరారు.

23 మండలాల్లో వర్షం

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 21: నైరుతి రుతుపవనాల ప్రభావంతో గడచిన 24 గంటల్లో 23 మండలాల్లో ఓ మోస్తరు నుంచి బలమైన వర్షం కురిసింది. అత్యధికంగా వి.కోటలో 52.2, అత్యల్పంగా చిత్తూరులో 1.6 మి.మీ వర్షపాతం నమోదైంది. అలాగే రామకుప్పంలో 38.2, శ్రీరంగరాజపురం 35.2, శాంతిపురం 34.2, పుంగనూరు 28.2, వెదురుకుప్పం 21.2, కుప్పం 21.0, గుడుపల్లి 19.6, బైరెడ్డిపల్లి 18.4, చౌడేపల్లి 14.8, సోమల 10.4, ఐరాల 10.2, పాలసముద్రం 10.2, పెనుమూరు 9.2, కార్వేటినగరం 6.4, చిత్తూరు రూరల్ 5.0, పెద్దపంజాణి 4.6, పూతలపట్టు 4.2, గుడిపాల 4.2, సదుం 3.2, గంగాధరనెల్లూరు 3.0, గంగవరంలో 2.2 మి.మీ వర్షం కురిసింది.







చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

కలుషితాహారంతో కలకలం

●అపోలో వర్సిటీలో 300మంది విద్యార్థులకు అస్వస్థత
● ఆరోగ్యం నిలకడగానే ఉందన్న వైద్యులు

చిత్తూరు రూరల్, ఆగస్టు 21: చిత్తూరు అపోలో యూనివర్సిటీలో బుధవారం ఫుడ్ పాయిజన్ కావడంతో సుమారు 300 మందికి పైగా విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. కొందరికి అపోలో కళాశాలలో, మరికొందరికి చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. చిత్తూరు నగర శివారు మురకంబట్టులోని అపోలో యూనివర్సిటీలో 1,200 మంది విద్యార్థులు హాస్టల్లో ఉంటూ చదువుకుంటున్నారు. మంగళవారం రాత్రి భోజనం చేసిన తర్వాత కొంతమందికి జ్వరం, కడుపునొప్పి వచ్చింది. వాంతులు, విరేచనాలు అయ్యాయి. కళ్లు తిరిగాయి. అప్రమత్తమైన అపోలో యాజమాన్యం కళాశాలలోని మెడికల్ సెంటర్ నుంచి డాక్టర్లను రప్పించి వైద్యం అందించారు. పరిస్థితి విషమంగా ఉన్న 90 మందికి పైగా విద్యార్థులను చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు. వారి ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.అపోలో కళాశాలను చిత్తూరు డీఎంహెచ్‌వో ప్రభావతిదేవి పరిశీలించారు. హాస్టల్, కిచెన్, పరిసర ప్రాంతాలను తనిఖీ చేశారు. డీన్, విద్యార్థులతో మాట్లాడి ఘటనకు సంబంధించిన విషయాలు తెలుసుకున్నారు. నీటి, భోజన శ్యాంపిల్స్‌ను తీసుకున్నారు. రిపోర్టు వచ్చే వరకు ఇక్కడి నీరు, భోజనం తీసుకోవద్దని డీఎంహెచ్‌వో ఆదేశించారు. అనంతరం చిత్తూరు ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ అరుణ్‌కుమార్‌తో కలిసి చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని, రెఫర్ చేయకుండా ఇక్కడే వైద్యం చేయాలని ఆదేశించారు.ఫుడ్ పాయిజన్‌కు గురై చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ పరామర్శించారు. ఘటనపై ఆరా తీశారు. విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను ఆదేశించారు.

మంత్రి పేషీ నుంచి ఆరా..

ఫుడ్ పాయిజన్‌పై వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ పేషీ నుంచి డీఎంహెచ్‌వో ప్రభావతికి ఫోన్ చేసి, ఆరా తీశారు. విద్యార్థుల పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. ఎప్పటికప్పుడు సమాచారం ఇవ్వాలని కోరారు.

నేడు అపోలో కళాశాలకు ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్

ఘటన వివరాలు తెలుసుకునేందుకు తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాల నుంచి ర్యాపిడ్ రెస్పాన్స్ టీం గురువారం చిత్తూరు అపోలో కళాశాలను పరిశీలించనుంది. ఘటనా స్థలాన్ని పరిశీలించి, విద్యార్థులతో మాట్లాడనుంది. పూర్తి స్థాయి కారణాలు తెలుసుకుని నివేదిక ఇవ్వనుంది.



కొత్త బియ్యం కార్డులు వచ్చేస్తున్నాయ్

కొత్త బియ్యం కార్డుల మంజూరుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. గత ఐదేళ్లలో కొత్త రేషన్‌కార్డులు పొందలేక చాలా కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నాయి. పెళ్లయిన కొత్త జంట వేరుగా కాపురం పెట్టినా రేషన్ కార్డులు పొందలేకపోయారు. మార్పులు - చేర్పుల కోసం సుమారు ఎనిమిది వేల దరఖాస్తులు ఏడాది కాలంగా పెండింగ్‌లో ఉన్నాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. కూటమి ప్రభుత్వం కొత్తగా పెళ్లయిన వారు వివాహ ధ్రువపత్రం చూపితే రేషన్ కార్డు మంజూరు చేయాలని నిర్ణయించింది.

- చిత్తూరు కలెక్టరేట్

● పెరగనున్న రేషన్ షాపులు

● **పాతవి వెనక్కి**

గత ప్రభుత్వం వైసీపీ రంగులతో మాజీ సీఎం జగన్, ఆయన తండ్రి వైఎస్ రాజశేఖర రెడ్డి బొమ్మలతో కూడిన బియ్యం కార్డులను అందజేశారు. ప్రస్తుత ప్రభుత్వం వాటిని వెనక్కు తీసుకుని కొత్త డిజైన్లతో ముద్రించి, పంపిణీ చేయనుంది. జిల్లాలో ప్రస్తుతం ఉన్న 5,43,263 కార్డుల్లో 4,97,247 మాత్రమే బీపీఎల్ కింద ఉన్నట్లు కేంద్రం గుర్తించి ఆహార భద్రత చట్టం కింద రాయితీ ఇస్తోంది. మిగిలిన 46,016 కార్డులపై సబ్సిడీ ఖర్చులను రాష్ట్ర ప్రభుత్వం భరించాల్సి వస్తోంది.

జిల్లాలో రేషన్ దుకాణాలు	1,379
మనుగడలో ఉన్న కార్డులు	5,43,263
వీటిలో బీపీఎల్	4,97,247
నాన్ బీపీఎల్	46,016

ప్రతినెలా సరుకులు తీసుకోని వారు 60వేల నుంచి 70వేలు

● **వారికి లేనట్టేనా..?**

ప్రభుత్వం గుర్తించిన 5,43,263 కార్డుల్లో 60-70వేల కుటుంబాలు ఆరు నెలలుగా సరుకులు తీసుకోవడం లేదు. వీరు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల సరిహద్దుల్లో ఉంటున్నారు. వీటిని ప్రభుత్వం తొలగించనుంది. ఆగస్టులో 5,43,263 కార్డుల్లో శుక్రవారం నాటికి 4,77,043 మంది మాత్రమే రేషన్ పొందారు. మిగిలిన 66వేల కార్డుదారులు రేషన్ పొందలేదు.

● **చౌకదుకాణాల సంఖ్య పెంపు**

జిల్లాలో రేషన్ పంపిణీ సజావుగా సాగేందుకు వీలుగా చౌకదుకాణాలను పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుతమున్న 1,379 దుకాణాలకు అదనంగా మరో 250 - 300 ఏర్పాటు చేయనుంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో అమల్లోకి తెచ్చిన మొబైల్ డెలివరీ యూనిట్ల (ఎండీయూ)తో ఇంటింటికి బదులు ఊరి చివరన లేదా రోడ్డు మధ్యన రేషన్ పొందాల్సి వచ్చేది. అందుకే కార్డుదారులకు వీలైనంత దగ్గర్లోనే దుకాణాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

మార్గదర్శకాలు సిద్ధం చేస్తున్నారు

కొత్త కార్డులకు సంబంధించి మార్గదర్శకాలు రూపొందుతున్నట్లు ఉన్నతాధికారుల నుంచి సమాచారం వచ్చింది. కొత్త వ్యక్తులను కార్డుల్లో చేర్చేందుకు, తొలగించేందుకు, చిరునామాల మార్పులు - చేర్పులు, ఆధార్ అనుసంధానం వంటి ప్రక్రియలకు సంబంధించి వారం, 10రోజుల్లో వెబ్‌సైట్ ప్రారంభం కానుంది. ఆదేశాలు వచ్చిన వెంటనే కొత్త కార్డుల మంజూరు ప్రక్రియ చేపడతాం.

- శంకరన్, డీఎస్వో, చిత్తూరు

నిబంధనలతో ఇబ్బందులు

గత వైసీపీ ప్రభుత్వంలో కార్డుల్లో సభ్యుల పేర్లు తొలగించడానికి సంబంధిత వ్యక్తే రావాలని నిబంధన పెట్టింది. ఈ క్రమంలో ఇతర రాష్ట్రాల్లో ఉద్యోగాలు చేసుకునే అనేక మంది తల్లిదండ్రుల కార్డుల నుంచి తమ పేర్లు తొలగించాలని వేడుకున్నా అధికారులు పట్టించుకోలేదు. సాంకేతిక కారణాలను సాకుగా చూపి సంక్షేమ పథకాలు ఆపేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం వాటిని సరళతరం చేస్తూ అర్హులైన ప్రతి ఒక్కరికీ కొత్తకార్డులు మంజూరు చేసేలా చర్యలు చేపట్టింది.

గో సంరక్షణ ట్రస్టుకు రూ.5 లక్షల విరాళం


విరాళం పత్రాన్ని అందిస్తున్న ఇన్‌చార్జి ఈవో వాణి

ఐరాల(కాణిపాకం), ఆగస్టు 21: కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయ గోసంరక్షణ ట్రస్టుకు బెంగళూరుకు చెందిన లక్ష్మీసంతోష్ బుధవారం రూ.5లక్షలు విరాళంగా అందించారు. తల్లిదండ్రులు మహేశ్వరి, మురళీకృష్ణ పేరున దాత విరాళాన్ని అందించారు. ఇన్‌చార్జి ఈవో వాణి ఆయన్ను స్వాగతించి, స్వామి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదాశీర్వాద మండపంలో ఆశీర్వదించి, స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపిక అందించారు. ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి, సూపరింటెండెంట్లు వాసు, కోదండ పాణి, ఆలయ ఇన్‌స్పెక్టర్ విఘ్నేష్ పాల్గొన్నారు.

జెన్‌ప్యాక్ట్‌లో 1,500 ఉద్యోగాలు : కలెక్టర్

తిరుపతి(విద్య), ఆగస్టు 21: ప్రముఖ ఐటీ కంపెనీ జెన్‌ప్యాక్ట్‌లో 1,500 ఉద్యోగాలకు బీటెక్, డిగ్రీ ఉత్తీర్ణులైన వారు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ వెంకటేశ్వర్ సూచించారు. ఈ ఉద్యోగాల భర్తీ కోసం రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రూపొందించిన పోస్టర్‌ను కంపెనీ ప్రతినిధులతో కలిసి బుధవారం ఆయన కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ కంటెంట్ మోడరైజేషన్, కస్టమర్ సర్వీస్ - వాయిస్ సపోర్ట్ విభాగాల్లో 1,500 ఉద్యోగాలు ఉన్నట్టు వివరించారు. ఏదేని గ్రూప్‌లో బీటెక్ లేదా ఏదేని డిగ్రీ 2022, 2023, 2024 సంవత్సరాల్లో ఉత్తీర్ణులైనవారు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. ఉద్యోగం హైదరాబాద్‌లో కల్పిస్తారని తెలిపారు. ముందుగా జ్ఞిఇట//ఙ్ఞీ.జూఢ46గ్ల6 లింక్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. ఈనెల 28వ తేదీ రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ. రిజిస్ట్రేషన్ పూర్తిచేసుకున్న అభ్యర్థుల అర్హతను పరిశీలించి వారిని ఇంటర్వ్యూకు అనుమతిస్తారు. ఎప్పుడు ఎక్కడ ఇంటర్వ్యూ జరుగుతుందనే వివరాలను రిజిస్ట్రేషన్ తర్వాత తెలియజేస్తారని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి లోకనాథం తెలిపారు. ఇతర వివరాలకు 99888 53335లో సంప్రదించవచ్చు. ఈ కార్యక్రమంలో ఏడీఎస్డీ మురళీకృష్ణ, డీపీవో గణేష్, కోఆర్డినేటర్లు దిలీప్, మహేష్ పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.46 కోట్లు

తిరుమల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.4.46 కోట్లు లభించింది. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ మంగళవారం లెక్కించి, బుధవారం ఉదయం ప్రకటించింది. మంగళవారం 73,082 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 27,972 మంది తలనీలాలు సమర్పించారు.

ఎస్వీ పాలిటెక్నిక్ స్కిల్‌హబ్‌లో... నైపుణ్యాలపై ఉచిత శిక్షణ, ఉపాధి కల్పన

తిరుపతి(విద్య), ఆగస్టు 21: వివిధ కంపెనీలకు కావలసిన విధంగా నిరుద్యోగులకు ఉచితంగా శిక్షణ ఇచ్చి... ఉపాధి కల్పించనున్నట్లు తిరుపతి ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ వై.ద్వారకానాథరెడ్డి తెలిపారు. ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన 4.0 పథకంద్వారా జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పాలిటెక్నిక్ కళాశాలలోని స్కిల్ హబ్‌లో ఈ శిక్షణా కార్యక్రమాలు ఉంటాయని ఆయన వివరించారు. ఉచితంగా నైపుణ్య శిక్షణ ఇచ్చి ఉద్యోగావకాశం కల్పిస్తారు. రోజులో 4 గంటలు మాత్రమే స్కిల్ హబ్‌లో శిక్షణా తరగతులు ఉంటాయి. 15 సంవత్సరాల నుంచి 35 సంవత్సరాల వయసు లోపలివారు మాత్రమే శిక్షణకు అర్హులు. శిక్షణ పూర్తిచేసిన వారికి ఎన్ఎస్‌డీసీ జారీచేసే ఎన్‌సీవీఈటీ సర్టిఫికెట్లు ప్రదానం చేస్తారు.

కోర్సుల వివరాలు

జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్, ఫీల్డ్ టెక్నీషియన్ నెట్‌వర్కింగ్ అండ్ స్టోరేజ్ కోర్సుల్లో శిక్షణ ఉంటుంది. 10వ తరగతి, ఆపైన ఉత్తీర్ణులైనవారు ఈ శిక్షణలో చేరేందుకు అర్హులు. రెండు కోర్సులకు మొత్తం 210 గంటల శిక్షణ ఉంటుంది. ఆసక్తి కలిగిన యువతీ యువకులు రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. 72073 89948, 90009 57055 నెంబర్లలో సంప్రదించి అభ్యర్థులు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. నేరుగా కలవాలనుకునేవారు తిరుపతి కేటీ రోడ్డులోని ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలోని స్కిల్ హబ్‌లో సంప్రదించవచ్చు.

శ్రీగంధం స్వాధీనం - 9మంది అరెస్టు

ఎర్రావారిపాలెం, ఆగస్టు 21: శ్రీగంధాన్ని స్మగ్లింగ్ చేస్తున్న ముఠాను ఎర్రావారిపాలెం పోలీసులు వల పన్ని పట్టుకొన్నారు. పోలీసుల కథనం మేరకు వివరాలు... మండలం నుంచి శ్రీగంధం అక్రమ రవాణా జరుగుతోందనే సమాచారంతో ఎర్రావారిపాలెం - రొంపిచెర్ల రోడ్డు జిల్లా పరిషత్ హైస్కూల్ వద్ద బుధవారం పోలీసులు నిఘా వేశారు. ఈక్రమంలో ప్రయాణికులతో వేగంగా వస్తున్న ఆటోను ఆపి పరిశీలించగా, రెండు మూటలు ఉన్నాయి. వాటిని విప్పి పరిశీలించగా శ్రీగంధం ఉన్నట్లు గుర్తించారు. శ్రీగంధాన్ని స్మగ్లింగ్ చేస్తున్న సుక్కలపాటి రమేష్, ఇరువారం మోహన్, ఆవులమడుగు రమేష్, గుండ్రాతికుప్పం చంద్రయ్య, సుక్కలపాటి లక్ష్మయ్య, కనికరం నాగరాజ, సుక్కలపాటి రాజేశ్వరి, ఆవులమడుగు కవిత, వై.గౌరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

అమ్మవారి సేవలో వైవీబీ రాజేంద్రప్రసాద్



తిరుచానూరు, ఆగస్టు 21: తిరుచానూరు పద్మావతి అమ్మవారిని బుధవారం ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చాంబర్ అధ్యక్షులు వైవీబీ రాజేంద్రప్రసాద్ దర్శించుకున్నారు. వేదపండితులు ఆయనకు వేదాశీర్వచనం అందజేశారు. ఆయనతో పాటు రాష్ట్రప్రధాన కార్యదర్శి బీర్రు ప్రతాప్‌రెడ్డి, ఉపాధ్యక్షులు సింగంశెట్టి సుబ్బరామయ్య, కొత్తపు మునిరెడ్డి, ఉమ్మడి చిత్తూరుజిల్లా పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షులు చుక్కా ధనుంజయ్‌యాదవ్, సర్పంచుల సంఘం రాష్ట్ర కార్యదర్శి కుప్పాల మురళి తదితరులున్నారు.

ఈ-క్రాప్ నమోదులో వివరాలు పక్కాగా ఉండాలి


అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 21: ఈ క్రాప్ నమోదులో పంటలకు సంబంధించిన పూర్తి వివరాలు ఉండాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 1,11,727 ఎకరాల్లో ఈ-క్రాప్ నమోదు పూర్తయ్యిందన్నారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిందు, తుంపర్ల సేద్య పరికరాల పంపిణీకి సంబంధించి రైతుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. ప్రస్తుత ఏడాది 21వేల హెక్టార్లు లక్ష్యంగా నిర్ణయించగా, ఇప్పటివరకు 10వేల హెక్టార్లకు 9,169 మంది రైతుల రిజిస్ట్రేషన్లు జరిగాయన్నారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ హిమవంశి, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు మురళీకృష్ణ, మధుసూదన్ రెడ్డి, శోభారాణి, బాలసుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

పెండింగ్ ఇళ్ల నిర్మాణాల పూర్తికి చర్యలు

జిల్లాలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద మంజూరైన ఇళ్లలో స్టేజ్ కన్వర్షన్ జరిపి పూర్తి చేయాలని గృహ నిర్మాణ అధికారులు, ఎంపీడీవోలను కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో పీఎం ఆవాస్ యోజన ఇళ్ల నిర్మాణాల పురోగతిపై సమీక్షించారు. ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేసేందుకు అవసరమైన ఆర్థిక సహాయాన్ని సంఘాల ద్వారా లబ్ధిదారులకు అందజేయాలని సూచించారు. ఎంపీడీవోలు, హౌసింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి, లబ్ధిదారులకు సహకరించాలని కోరారు.

విస్తరణ దిశగా విమానాశ్రయం


ఏటీసీ బిల్డింగ్ నిర్మాణం

మరిన్ని నగరాలకు విమానాలు

అంతర్జాతీయ సర్వీసులకోసం రన్‌వే విస్తరణ పనులు పూర్తి


విమానాశ్రయ డైరెక్టర్ శ్రీనివాసరావు

రేణిగుంట, ఆగస్టు 21: తిరుపతి విమానాశ్రయం నుంచి దేశంలోని పలు నగరాలకు విమాన సర్వీసులు త్వరలో విస్తరించనున్నాయి. రేణిగుంటలోని విమానాశ్రయం నుంచి వారంలో నాలుగు రోజులు 14, మిగిలిన 3 రోజులు 13 విమాన సర్వీసులు విశాఖపట్టణం, హైదరాబాద్, విజయవాడ, బెంగళూరు, బెల్గామ్, ఢిల్లీ నగరాల నుంచి నడుస్తున్నాయి.ఈ నేపథ్యంలో ఇక్కడినుంచి ముంబై, అహ్మదాబాద్, కోల్‌కత్తా, అలహాబాద్, మధురై, తిరుచ్చి, తిరువనంతపురం విమానాశ్రయాల నుంచి సర్వీసులు నడిపేందుకు ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ఈ ప్రతిపాదనల పట్ల సానుకూలంగా స్పందించిన పలు విమాన సంస్థలు తిరుపతికి విమాన సర్వీసులు పెంచనున్నాయి. అయితే ఈ సర్వీసులు తిరుపతికి నేరుగా కాకుండా కనెక్టింగ్ విమానాల ద్వారా నడిపేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. భవిష్యత్తులో ఈ సర్వీసుల ద్వారా ప్రయాణికులు పెరిగితే ఆయా నగరాల నంచి తిరుపతి విమానాశ్రయానికి నేరుగా సర్వీసులు నడిపేందుకు అవకాశం ఉంటుంది.ఈ విషయంపై ఎయిర్‌పోర్టు డైరెక్టర్ శ్రీనివాసరావును అడగ్గా దేశంలోని పలు ప్రధాన నగరాల నుంచి తిరుపతి విమానాశ్రయానికి సర్వీసులు నడిపేందుకు కొన్ని సంస్థలు ముందుకు వస్తున్నాయన్నారు. ఇప్పటికే అంతర్జాతీయ విమానాలు ల్యాండయ్యేందుకు రన్‌వే పనులు పూర్తయ్యాయని,ఢిల్లీలో వున్న డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) పరిశీలించి అనుమతులు ఇవ్వడం కూడా జరిగిందన్నారు.రన్ వే మరింత విస్తరణ కోసం, ప్రత్యేక లైటింగ్ ఏర్పాట్లకు 11.11 ఎకరాలు అవసరం ఉండగా రాష్ట్రప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపగా సానుకూలంగా స్పందించిందన్నారు. త్వరలో భూమిని సర్వే చేసి విమానాశ్రయానికి అందజేయనున్నారని తెలిపారు. అడ్వాన్స్‌డ్ టెక్నాలజీతో ఏటీసీ బిల్డింగ్ పనులు రూ.47కోట్ల వ్యయంతో జరుగుతున్నాయని, గతంలో ఉన్న టవర్ కన్నా అధికంగా 18 మీటర్లు వెడల్పు కలిగిన ఏటీసీ టవర్‌ను నిర్మిస్తున్నామన్నారు.

భక్తుల ఆరోగ్య భద్రత టీటీడీ ప్రథమ కర్తవ్యం

టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి


ఫుడ్ సేఫ్టీపై శిక్షణ ఇస్తున్న ఆంజనేయులు

తిరుమల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చే భక్తులకు సరసమైన ధరలకు ఆరోగ్యకరమైన, పరిశుభ్రమైన ఆహారాన్ని అందించడంతో పాటు వారి ఆరోగ్య భద్రతే టీటీడీకి అత్యంత ప్రాధాన్యత అని అదనపు ఈవో వెంకయ్య చౌదరి అన్నారు. టీటీడీ ఆరోగ్య విభాగం, ఆహార భద్రత విభాగాలతో కలిసి తిరుమలలోని హోటళ్ల నిర్వాహకులు, యజమానులకు తిరుమలలోని శ్రీవారిసేవాసదన్‌లో బుధవారం జరిగిన శిక్షణా కార్యక్రమంలో అదనపు ఈవో పాల్గొని మాట్లాడారు. హోటళ్లలో అన్ని రకాల తినుబండారాలను ఫుడ్ సేఫ్టీ నిర్దేశించిన ప్రమాణాల మేరకే తయారు చేయాలని చెప్పారు. న్యూఢిల్లీకి చెందిన ఎఫ్ఎస్ఎస్ఏఐ సర్టిఫైడ్ ట్రైనర్ ఆంజనేయులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఫుడ్ సేఫ్టీ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌లో అన్ని రెస్టారెంట్లు, తినుబండారాలలో అనుసరించాల్సిన పరిశుభ్రత, పారిశుద్ధ్య పద్ధతులు, ఆహారం చెడిపోవడం వల్ల కలిగే భౌతిక-రసాయన-జీవ ప్రమాదాలు, వృధా వంటి వాటి గురించి వివరించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే తీసుకునే చర్యల గురించి తెలియజేశారు. టీటీడీ ఆరోగ్య శాఖ డిప్యూటీఈవో ఆశాజ్యోతి మాట్లాడుతూ.. ఇక నుంచి ప్రతి మూడు నెలలకొకసారి తిరుమలలో హోటళ్ల వ్యాపారులందరికీ ఈశిక్షణ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఈకార్యక్రమంలో హెల్త్‌ఆఫీసర్ మధుసూదన్‌రావు, జిల్లా ఫుడ్ కంట్రోలర్ వెంకటేశ్వరరావు, తిరుమల ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ జగదీష్, తిరుమలలోని హోటళ్ల వ్యాపారులు, టీటీడీ అన్నప్రసాదం సిబ్బంది పాల్గొన్నారు.

తిరుమలలో అనధికార నివాసాల తొలగింపు


షెడ్లను తొలగిస్తున్న పొక్లెయినర్

తిరుమల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఉన్న అనధికార నివాసాలను టీటీడీ గురువారం తొలగించింది. తిరుమల భద్రత దృష్ట్యా ఇటీవల విజిలెన్స్, పోలీసు అధికారులు తిరుమలలోని పలు ప్రాంతాల్లో ఆకస్మిక దాడులు చేసిన విషయం తెలిసిందే. ఎలాంటి గుర్తింపు లేని వ్యక్తులను గుర్తించడంతో పాటు నిషేధిత వస్తువులు ఏమైనా ఉన్నాయా అనే అంశంపై తనిఖీలు చేశారు. కాగా, గతంలో భవన నిర్మాణం కోసం వచ్చిన కార్మికులు తమ పనులు పూర్తయినప్పటికీ ఇంకా తిరుమలలోనే ఉన్నట్టు గుర్తించారు. బాలాజీనగర్‌కు సమీపంలోని పాచికాల్వ గంగమ్మ ఆలయానికి సమీపంలో 70పైగా ఉన్న షెడ్లలో నివాసముంటున్నట్టు గుర్తించారు. ఈక్రమంలో కొంతమంది అనధికార వ్యక్తులను తిరుమల నుంచి పంపేశారు. మరికొంతమంది నుంచి వివరాలను సేకరించారు. కాగా, భవన కార్మికుల కోసం ఏర్పాటు చేసిన తాత్కాలిక షెడ్లను బుధవారం సాయంత్రం పొక్లెయినర్‌తో తొలగించారు.

మీరు లాకర్ తీసుకుని ఏడాది అవుతోంది!

ఫైన్ కట్టండి లేకుంటే ఆధార్ బ్లాక్ చేస్తాం

భక్తులను బెదిరించి దోచుకుంటున్న యువకుడు

టీటీడీ విజిలెన్స్ విచారణలో వెలుగులోకి

తిరుమల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): టీటీడీలో సరికొత్త అక్రమం వెలుగు చూసింది. 'మీరు లాకర్ తీసుకుని దాదాపు ఏడాది అవుతోంది. మీరు ఖాళీ చేయకపోవడం వల్ల ఫైన్ పడింది. కట్టకుంటే మీ ఆధార్ కార్డును బ్లాక్ చేస్తాం' అంటూ ఓ యువకుడు శ్రీవారి భక్తులను బెదిరిస్తూ అందినకాడికి దోచుకుంటున్నాడు. తిరుమలలో బస చేసేందుకు గదులతో పాటు యాత్రికుల వసతి సముదాయాల్లో లాకర్లు అందుబాటులో ఉన్న విషయం తెలిసిందే.గదులు లభించని చాలామంది భక్తులు ఈ లాకర్లపైనే ఆధారపడుతుంటారు. లాకర్లలో లగేజీని భద్రపరుచుకుని దర్శనమయ్యాక తీసుకుని వెళ్లిపోతుంటారు. లాకర్ పొందే సమయంలో భక్తులు తమ వివరాలు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది.ఇటీవల ఓ యువకుడు కొంతమంది భక్తులకు ఫోన్ చేసి వారు తిరుమలకు వచ్చిన తేదీ, లాకర్ తీసుకున్న ప్రాంతం, ఆధార్, సెల్‌నెంబరు చెబుతున్నాడు.ఇప్పటివరకు లాకర్ ఖాళీ చేయకపోవడంతో తమ ఆడిట్‌లో ఫైన్ పడిందని, ఆ సొమ్ము కట్టకపోతే ఇకపై దర్శనాలు, గదులు, లాకర్లు తీసుకునే వీల్లేకుండా ఆధార్ కార్డును బ్లాక్ చేస్తామని బెదిరిస్తున్నాడు.ఆధార్ బ్లాక్ అయిపోతే ఇబ్బంది పడతామన్న కొంతమంది భక్తులు ఆ యువకుడు డిమాండ్ చేసిన డబ్బును చెల్లించినట్టు తెలిసింది. ఇటీవల ఓ భక్తురాలికి ఫోన్ చేసి ఫైన్ కట్టాలని డిమాండ్ చేయడంతో ఆమె నగదు చెల్లించింది.ఆ పరిచయంతో తనకు దర్శనం కావాలని కోరగా చేయిస్తానని నమ్మించిన ఆ యువకుడు నగదు తీసుకుని తర్వాత చేతులెత్తేశాడు. దీంతో ఆ భక్తురాలు విజిలెన్స్‌ను ఆశ్రయించగా విచారణలో ఈ అక్రమం వెలుగు చూసింది. ఆ యువకుడు బెంగళూరులో ఉన్నట్టు గ్రహించిన టీటీడీ అధికారులు అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. అయితే ఆ భక్తుల వివరాలు అతడి వద్దకు ఎలా చేరాయనేది ప్రశ్నార్థకంగా మారింది.

తిరుమలలో మెగాస్టార్



సినీ హీరో చిరంజీవి బుధవారం సాయంత్రం తిరుమలకు వచ్చారు.గురువారం తన పుట్టినరోజు సందర్భంగా శ్రీవారి ఆశీస్సుల కోసం అమ్మ అంజనాదేవి, భార్య సురేఖ, కుమార్తె శ్రీజ, మనవరాలు నవిష్కలతో కలిసి కొండ పైకి చేరుకున్నారు.

24, 25 తేదీల్లో అండర్ 14 క్రికెట్ సెలక్షన్స్

తిరుపతి(క్రీడలు), ఆగస్టు 21: ఉమ్మడి చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 24, 25వ తేదీల్లో అండర్ 14 బాయ్స్ క్రికెట్ సెలక్షన్స్ నిర్వహించనున్నట్లు సీడీసీఏ సంఘం అధ్యక్షుడు బి.విజయ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 01-09-2010 తర్వాత జన్మించిన యువకులు అర్హులని, క్రీడాదుస్తులు, కిట్, ఆధార్, జనన ధ్రువీకరణ పత్రాలను తీసుకురావాలన్నారు. యువ క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాల కోసం 90002 14966, 88861 85559 నెంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు. వేదిక వివరాలిలా... పుత్తూరులోని ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ డిగ్రీకళాశాల, శ్రీకాళహస్తిలోని కేసీసీ క్రికెట్‌నెట్స్, పీలేరులోని పియోక్ క్రికెట్ అకాడమి, భువనవిద్యానిలయం, వాల్మీకిపురంలోని జీవీఎస్‌సీఎస్ క్రికెట్ మైదానం, తిరుపతిలోని సీవీ క్రికెట్ అకాడమి, చిత్తూరులోని పోలీసుగ్రౌండ్, పలమనేరులోని ప్రభుత్వ డిగ్రీకళాశాల, వి.కోటలోని జీఎంఆర్ క్రికెట్ అకాడమిలలో ఎంపిక పోటీలు నిర్వహించనున్నారు.

నీటి వినియోగంపై టీటీడీ ఆంక్షలు


మూడు కొళాయిల్లో ఒకటి బంద్

తిరుమలలో ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు

హోటళ్లకు ఇకపై ఎనిమిది గంటలే సరఫరా

అదనంగా కావాలంటే తిరుపతి నుంచి తెచ్చుకోవచ్చు


బాలాజీనగర్

తిరుమల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో నీటి వినియోగంపై టీటీడీ ఆంక్షలు విధించింది. భవిష్యత్తులో నీటి ఎద్దడి తలెత్తకుండా ఉండేందుకు, భక్తులకు నీటి కొరత ఏర్పడకుండా చూసేందుకు హోటళ్లకు, మఠాలకు, స్థానికులకు ఇకపై నీటి సరఫరా నిరంతరం ఉండదంటూ ఉత్తర్వులు జారీ చేసింది. తిరుమల అవసరాలకు రోజూ దాదాపు 40 లక్షల గ్యాలన్ల నీరు అవసరం. ఈ నీటిని పాపవినాశనం, కుమారధార, పసుపుధార, గోగర్భం, ఆకాశగంగ డ్యాముల నుంచి తీసుకుని శుద్ధి అనంతరం సరఫరా చేస్తుంటారు. 14,304 లక్షల గ్యాలన్ల నీటి సామర్థ్యం ఉన్న ఈ డ్యాముల్లో ప్రస్తుతం నీళ్ల సగానికి పైగానే ఉన్నాయి. అయితే వర్షాలు తక్కువగా పడడం, రాబోయే రోజుల్లో వర్షాలు కురిసే అవకాశాలు తక్కువగా ఉన్నాయనే అంచనా వేసిన టీటీడీ ప్రస్తుతం ఉన్న నీటిని పొదుపుగా వాడుకోవాలని భావిస్తోంది.ఏడెనిమిదేళ్ల క్రితం అమలు చేసిన నీటిపొదుపు చర్యలను పరిశీలించి వాటినే పాటించాలని భావించి నీటి నియంత్రణ నిబంధనలను ఈ నెల మొదటివారంలో ఇంజినీరింగ్ వాటర్‌వర్క్స్ విభాగం విడుదల చేసింది.తిరుమలలోని హోటళ్లు, జనతా క్యాంటీన్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లకు టీటీడీ వాటర్‌వర్క్స్ విభాగం 24 గంటల పాటు నీటిని సరఫరా చేస్తోంది. ఈనెల 25వ తేదీ నుంచి ఉదయం 6 నుంచి 10 గంటలకు, మధ్యాహ్నం 3 నుంచి రాత్రి 7 గంటల వరకు మొత్తం ఎనిమిది గంటల పాటు మాత్రమే నీటిని సరఫరా చేయనున్నట్లు నోటీసులను హోటళ్ల నిర్వాహకులకు అందజేసింది.అదనపు నీరు కావాలంటే విజిలెన్స్ అనుమతితో తిరుపతి నుంచి ప్రైవేట్ ట్యాంకర్ల ద్వారా తెచ్చుకోవచ్చని సూచించింది.మఠాలకు కూడా ఇదే తరహాలో ఆంక్షలు విధించారు. తిరుమలలోని అన్నప్రసాదభవనం, ముఖ్యప్రాంతాల్లోని నీటి కుళాయి కేంద్రాలు, కాటేజీల్లో నీటి వినియోగాన్ని తగ్గించే ప్రణాళికలు కూడా సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే జలప్రసాదాల్లో కొన్ని నీటి కుళాయిలను మూసివేశారు. నాలుగు కుళాయిలున్న చోట రెండు, ఐదు కుళాయిలున్న చోట మూడింటికి కుదించారు.పలు ప్రాంతాల్లో జరుగుతున్న కాటేజీల నిర్మాణానికి సంబంధించిన కాంట్రాక్టర్లకు కూడా నిబంధనలు పెట్టారు.తిరుపతి నుంచి ట్యాంకర్ల ద్వారా నీటిని తెచ్చుకోమని సూచించారు.

బాలాజీనగర్‌కు ఆరు రోజులకోసారి

నీటిపొదుపులో భాగంగా తిరుమలలో స్థానికులు నివసించే బాలాజీనగర్‌కు ఆరు రోజులకోసారి మాత్రమే నీటిని విడుదల చేస్తామని టీటీడీ ప్రకటించడంతో స్థానికుల్లో భయం మొదలైంది.ఇక్కడ మొత్తం 1,060 ఇళ్లు ఉండగా దాదాపు 10 వేలమంది నివాసముంటున్నారు. ఆరు రోజులకోసారి నీళ్లు విడుదల చేస్తే వంటకు కూడా ఇబ్బందిపడాల్సి వస్తుందని ఆందోళన చెందుతున్నారు.మూడురోజులకు ఓసారైనా నీటిని విడుదల చేయాలని కోరుతున్నారు.

4 నెలలకు మాత్రమే నీళ్లున్నాయ్: టీటీడీ

తిరుమలలో నీటి అవసరాలను తీర్చడానికి ఐదు ప్రధాన డ్యాముల్లో ప్రస్తుతమున్న నీరు 120 నుంచి 130 రోజులు మాత్రమే సరిపోతాయని టీటీడీ బుధవారం ఓ ప్రకటన ద్వారా తెలిపింది. తిరుమలలోని డ్యాముల్లో 5,800 లక్షల గ్యాలన్ల నీరు మాత్రమే అందుబాటులో ఉందని, రానున్న బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా నీటి వినియోగాన్ని నియంత్రించేందుకు కొన్ని చర్యలు తీసుకుంటున్నట్లు టీటీడీ పేర్కొంది.

పాలశీతల కేంద్రాన్ని పునఃప్రారంభించండి



చల్లాబాబుతో సోమల టీడీపీ నాయకులు

రొంపిచెర్ల, ఆగస్టు 21 : సోమలలో ఏర్పాటు చేసిన పాల శీతల కేంద్రాన్ని తిరిగి ప్రారంభించాలని మండల టీడీపీ నాయకులు ఆ పార్టీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రా రెడ్డిని కోరారు. బుధవారం రొంపిచెర్లలో ఆయనను కలిసి సోమల--పెద్దఉప్పరపల్లె తారు రోడ్డు గుంతలు పడి రాకపోకలకు ఇబ్బందిగా ఉందని, సోమల పంచాయతీ కార్యాలయం సమీపంలో వర్షం పడితే రహదారి చెరువులా మారుతోందని, ఈ సమస్యను పంచాయతీ కార్యదర్శికి తెలిపినా పరిష్కారం కాలేదన్నారు. శివాలయం వద్ద ఏర్పాటు చేసిన నీటి శుద్ధి కేంద్రం మూత పడిందన్నారు. సోమల బస్టాండ్ వద్ద రోడ్డు విస్తరణ పనులు చేపట్టి డివైడర్ పనులు చేయాలని కోరారు. అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తామని వారికి చల్లాబాబు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు శివశంకర్, మణియాదవ్, మహేంద్రబాబు(చిన్నబాబు), మల్లికార్జున, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చేపల అక్రమ వేటను నిషేధించాలి

పుంగనూరు రూరల్, ఆగస్టు21: చెరువులు, కుంటల్లో చేపలను అక్రమంగా పట్టుకునే వారిపై చర్యలు తీసుకోవాలని మత్స్యకార సంఘ అధ్యక్షుడు కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. బుధవారం మత్స్యకారుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బెస్త కులస్థులకు జీవనాధారమైన చేపల పట్టుట, విక్రయించు హక్కుగా అభివర్ణించారు. కొంతమంది బెస్తల హక్కులను కాలరాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనుమతులు లేకుండా చేపలను వేటాడితే వారిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. పట్టణంలో చేపల విక్రయ దుకాణాలను ఏర్పాటు చేసి నాణ్యమైన చేపల మాంసాన్ని విక్రయించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘనాయకులు కామేశ్వరరావు, కుమార్, దొరస్వామి, రఘుబాబు, ప్రకాశ్, చంద్ర, మోహన్ పాల్గొన్నారు.

అన్నక్యాంటీన్‌కు అనూహ్య స్పందన



పలమనేరు, ఆగస్టు21 : పలమనేరు ఆర్టీసీ బస్టాండు సమీపంలో ఈనెల 16న పునఃప్రారంభించిన అన్నక్యాంటీన్‌కు అనూహ్య స్పందన లభిస్తోంది. రోజురోజుకు ప్రజల సంఖ్య పెరిగిపోతోంది. బుధవారం మధ్యాహ్నం మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి అన్నక్యాంటీన్‌ను సందర్శించారు. క్యూలో వచ్చి ఆహారాన్ని తీసుకోవాలని, గుంపులుగా వస్తే సరఫరా ఇబ్బంది అవుతుందని ప్రజలకు సూచించారు.

పట్టురైతులకు అవగాహన సదస్సు



మాట్లాడుతున్న ఇఫ్కో సంస్థ రాష్ట్ర అధికారి శ్రీధర్‌రెడ్డి

పలమనేరు, ఆగస్టు21 : పలమనేరులో బుధవారం పట్టురైతులకు ఎరువులు, బీమా గురించి అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఇఫ్కో రాష్ట్ర అధికారి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ ఇఫ్కో ఎరువులు, కిసాన్ డ్రోన్లు, సంకటహరణ బీమా పథకాల గురించి వివరించారు. రైతు కొనుగోలు చేసిన ప్రతి ఎరువుల బస్తా లేదా నానో ఎరువుల బాటిల్‌కు రూ. 10 వేలు ఉచిత ప్రమాద బీమా గరిష్టంగా 20 బస్తాలు లేదా 20 బాటిళ్ల నానో ఎరువు కొన్న వారికి రూ. 2 లక్షల మేర ఉచిత ప్రమాద బీమా వర్తిస్తుందన్నారు. విశ్రాంత సీఎస్ఆర్ శాస్త్రవేత్తలు డాక్టర్.సుబ్రమణ్యం మల్బరీ సాగులో మెలకువలు, సాగు యాజమాన్యం, జాగ్రత్తలను వివరించారు. పలమనేరు ఏడీ కిషోర్‌కుమార్‌నాయక్, కుప్పం ఏడీ హనుమంతునాయక్, ఇఫ్కో జిల్లా అధికారి దిలీప్‌కుమార్, మణిచంద్ర, సీఆర్‌సీ కృష్ణ, పట్టురైతులు పాల్గొన్నారు.

తాత్కాలిక సర్దుబాటులో అసంబద్ధ నిర్ణయాలు

చౌడేపల్లె,ఆగస్టు21: రాష్ట్రప్రభుత్వం తీసుకుంటున్న ఉపాధ్యాయుల తాత్కాలిక సర్దుబాటులో పలు అసంబద్ధమైన నిర్ణయాలు ఉన్నాయని యూటీఎఫ్, ఎస్‌టీయూ శాఖ సంఘ సభ్యులు ఎంఈవోలు కేశవరెడ్డి, తిరుమలమ్మలకు వినతిపత్రం అందించారు. బుధవారం వారు మాట్లాడుతూ.. తాత్కాలిక సర్దుబాటు నిర్ణయం వలన ఏడాది తరువాత మళ్ళీ సర్దుబాటుకు గురికావాల్సి వస్తుందన్నారు. సోషియల్, ఇంగ్లీష్ పోస్టులకు ఫ్రీజింగ్ జరిగిన వెంటనే తొలగించాలని కోరారు. అన్ని కేడర్‌లో మిగులు ఉపాధ్యాయులను మండల స్థాయిలో సర్దుబాటు చేయాలని కోరారు. ఉర్దూ హైస్కూల్‌లో తెలుగు మీడియం వారిని వేయకూడదని అన్నారు.

గ్రామాల అభివృద్ధి కోసం ప్రణాళికలు



సమావేశంలో మాట్లాడుతున్న ఈవోపీఆర్డీ శివశంకర్

గుడుపల్లె, ఆగస్టు21:గ్రామాల అభివృద్ధి కోసం ప్రణాళికలు అవసరమని, కార్యదర్శులు, సర్పంచుల సహకారంతో తయారు చేయాలని ఈవోపీఆర్డీ శివశంకర్ పేర్కొన్నారు. సర్పంచులకు, పంచాయతీ కార్యదర్శులకు మూడు రోజుల శిక్షణా కార్యక్రమంలో భాగంగా మూడవ రోజు బుధవారం అభివృద్ధి ప్రణాళికలు, వీధి దీపాల నిర్వహణపై అవగహన కల్పించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ గ్రామాల్లో ఏమి అవసరమో వాటిని ప్రజల నుంచి తెలుసుకుని ప్రణాళిక రూపకల్పన చేయాలన్నారు. ప్రతి మూడు నెలలకొకసారి గ్రామసభ కచ్చితంగా నిర్వహించాలని చెప్పారు. ఎంపీడీవో తాజ్ మస్రూర్, శిక్షకులు కుప్పం ఈవోపీఆర్డీ విజయదత్, కార్యదర్శి నరసింహులు, స్వచ్ఛ భారత్ కోఆర్డినేటర్ భాస్కర్, సీనియర్ సహాయకులు సురేష్, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలి మెడలో బంగారు చైన్ చోరీ



బాధితురాలు నాగమణి

గంగవరం, ఆగస్టు 21: పట్టపగలే వృద్ధురాలిని బెదిరించి బంగారు చైను అపహరించిన ఘటన గంగవరం మండలంలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు... కలగటూరు గ్రామానికి చెందిన నాగమణి (61)కి నా అన్నవాళ్లు ఎవరూ లేరు. దీనికి తోడు అనారోగ్యంతో మంచానికే పరిమితమై, కనీసం 10 అడుగులు కూడా ముందుకు వేయలేని పరిస్థితి. ప్రభుత్వం అందించే ఫించన్ మాత్రమే ఆమెకు జీవనాధారం. ఈ క్రమంలో బుధవారం ఉదయం హాల్‌లో నుంచి వంటగదిలోకి వెళ్తుండగా, వెనుక నుంచి మూతికి మాస్క్ ధరించిన అపరిచిత వ్యక్తి వచ్చి, చేతులు గట్టిగా పట్టుకొని మెడలో ఉన్న బంగారు చైన్‌ను లాక్కొని పరుగులు తీశాడు. వృద్ధురాలి అరుపులు విన్న స్థానికులు అక్కడకు చేరుకోగా, వృద్ధురాలు ఏడుస్తూ కనిపించింది. ఏం జరిగిందని ప్రశ్నించగా చైన్ లాక్కొని వెళ్లిపోయారని బోరున విలపించింది. దీంతో స్థానికులు చోరీ ఘటనపై గంగవరం పోలీసులకు సమాచారం అందించారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

పలమనేరు డీఎస్పీగా ప్రభాకర్



పలమనేరు, ఆగస్టు21 : పలమనేరు డీఎస్పీగా డి.ప్రభాకర్ రాజమండ్రి నుంచి బదిలీపై వచ్చారు. పలమనేరులో ప్రస్తుత డీఎస్పీ రఘువీర్ విష్ణు కాకినాడకు బదిలీ అయ్యారు. ప్రభాకర్ త్వరలోనే బాధ్యతలు స్వీకరించనున్నట్టు పోలీసువర్గాలు తెలిపాయి.

ప్రత్యేక అలంకరణలో రాఘవేంద్రస్వామి



పుంగనూరు రూరల్, ఆగస్టు 21: పట్టణంలోని బ్రాహ్మణవీధిలో వెలసిన రాఘవేంద్ర స్వామి బుధవారం ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. 353వ ఆరాధన దినోత్సవం సందర్భంగా స్వామి వారిని పంచామృతాభిషేకం, సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు, అర్చనలు. చేసి పూలతో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. భక్తులు మొక్కులు తీర్చకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు. శ్రీహరిహర బ్రాహ్మణ యువజన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

గెస్ట్ ఫ్యాకల్టీ కోసం దరఖాస్తుల ఆహ్వానం

కుప్పం, ఆగస్టు 21: కుప్పంలోని ప్రభుత్వ వృత్తివిద్య జూనియర్ కళాశాలలో వివిధ సబ్జెక్టుల గెస్ట్ ఫ్యాకల్టీ ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జ్యోతీశ్వరన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఏఅండ్‌టీ, ఎంఎల్‌టీ, జీఎఫ్‌సీ కోర్సులకు ఫ్యాకల్టీ కావాలన్నారు. సంబంధిత సబ్జెక్టులో పీజీ చేసి ఉండాలన్నారు. వివరాలకు 8919663316 నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ధర్మరాజు ఆలయంలో అభివృద్ధి పనులు ప్రారంభం

కుప్పం రూరల్, ఆగస్టు 21: మండలంలోని పెద్దబంగారునత్తంలో వెలసిన ధర్మరాజు ఆలయంలో అభివృద్ధి పనులను బుధవారం ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ ప్రారంభించారు. ఆలయ అభివృద్ధికి ప్రభుత్వ సాయం అందిస్తామని ఆయన గ్రామస్థులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కూటమి నేతలు, ప్రజలు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

పుంగనూరు రూరల్, ఆగస్టు21: కుటుంబ కలహాలతో ఓయువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన బుధవారం పుంగనూరులో జరిగింది. బాధితుడి కథనం మేరకు .... పట్టణంలోని బ్రాహ్మణవీధికి చెందిన రమేశ్ కుమారుడు రాంచరణ్(30) కుటుంబ కలహాలతో పురుగుల మందు తాగి స్పృహ కోల్పోయాడు, గుర్తించిన కుటుంబసభ్యులు పుంగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందించారు.

కుటుంబ కలహాలతో...

పుంగనూరు రూరల్, ఆగస్టు21: కుటుంబ కలహాలతో ఓ మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన బుధవారం పుంగనూరులో జరిగింది. బాధితురాలి కథనం మేరకు ... పట్టణంలోని ప్రకాశం కాలనీకి చెందిన అశోక్ మేస్త్రీ పని చేస్తూ జీవనం సాగిస్తుండేవాడు. ఈ నేపథ్యంలో అశోక్ మద్యం తాగి రోజు భార్య వసంత (35)తో గొడవ పడుతుండగా పురుగుల మందు తాగి స్పృహ కోల్పోయింది. గుర్తించిన కుటుంబసభ్యులు స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్సలు అందించారు.

మరదలిపై బావ దాడి

పుంగనూరు రూరల్, ఆగస్టు 21: పొలం వద్ద అన్నదమ్ములు గొడవ పడుతుండగా అడ్డు వెళ్లిన మరదలిపై బావ దాడి చేసి గాయపరచిన ఘటన బుధవారం పుంగనూరు మండలంలో చోటుచేసుకుంది. బాధితుల కథనం మేరకు .. చంద్రమాకులపల్లె పంచాయతీ ఒంటిమిట్టకు చెందిన నరసింహులు కుమారులు వెంకటరమణ, మల్లికార్జునలు పొలం వద్ద ఘర్షణ పడ్డారు. మల్లికార్జునను అన్న వెంకటరమణ కొట్టుతుండగా మల్లికార్జున భార్య భారతి అడ్డువెళ్లగా ఆమెపై దాడి చేసి తీవ్రంగా గాయపర్చాడు. గాయపడిన భారతిని పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్సలు అందించారు. పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు.

వీధి కుక్కలకు వ్యాక్సిన్



పలమనేరు,ఆగస్టు21:పలమనేరులో వీధికుక్కల నుంచి ప్రజలకు ఇబ్బంది కలగకుండా మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి చర్యలు ప్రారంభించారు. తిరుపతి అనిమల్ కేర్ ల్యాండ్ సహకారంతో వీధికుక్కలను పట్టించి వాటికి వ్యాక్సిన్, స్టెరిలైజేషన్ చేసి మళ్లీ వాటిని యథాస్థానంలో విడిచిపెట్టే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. బుధవారం నాటికి దాదాపు 30 వీధికుక్కలను అనిమల్‌కేర్ ల్యాండ్ సిబ్బంది పట్టుకోగలిగారు. ఈ కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ చాముండేశ్వరి ప్రారంభించారు.

రేపు పారిశుధ్య సిబ్బందికి ఉచిత వైద్య పరీక్షలు

పలమనేరు, ఆగస్టు21 : పలమనేరు మున్సిపాలిటీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు ఈనెల 23వ తేదీన కాకాతోపులోని అర్బన్ హెల్త్ సెంటరులో వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి తెలిపారు. సీఎంసీ నుంచి వైద్యబృందం వచ్చి పారిశుధ్య కార్మికులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు.

వర్మీ కంపోస్టు తయారీపై శిక్షణ తరగతులు

బైరెడ్డిపల్లె, ఆగస్టు 21: స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో మూడురోజులుగా పారిశుధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణ, పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై సర్పంచులు, కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లకు జరుగుతున్న శిక్షణా కార్యక్రమం బుధవారం ముగిసింది. ఇందులో భాగంగా బైరెడ్డిపల్లె ఎస్‌డబ్ల్యూపీసీ వద్ద తడి, పొడిచెత్తను వేరుచేసి వాటి ద్వారా వర్మీ కంపోస్టును తయారుచేసే విధానం గురించి రీసోర్స్ పర్సన్లు సద్గుణ, మహేష్ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాజేంద్రబాలాజీ, ఎంసీవో సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ చేస్తే ప్రభుత్వాలు కూలడం ఖాయం





పుంగనూరులో ర్యాలీ చేస్తున్న దళిత సంఘ నాయకులు, బస్టాండ్‌లో ధర్నా చేస్తున్న మాల మహానాడు నాయకులు

పుంగనూరు రూరల్, ఆగస్టు 21: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వర్గీకరణ చేయడానికి ప్రయత్నం చేస్తే దళితులు ఏకమై ప్రభుత్వాలను కూల్చడం ఖాయమని దళిత సంఘ నాయకులు హెచ్చరించారు. బుధవారం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రోడ్డుపై బైఠాయించి వర్గీకరణ వద్దు...కలసివుంటే కలదు సుఖం అంటూ నినాదాలు చేశారు. దాదాపు గంటపాటు రోడ్డుపై బైఠాయించడంతో రాకపోకలు స్థంభించాయి. సీఐ శ్రీనివాసులు ఘటనా స్థలానికి చేరుకుని ఆందోళనకారులకు నచ్చజెప్పడంతో సంఘనాయకులు ఎన్టీఆర్ సర్కిల్ వరకు ర్యాలీ చేశారు. అనంతరం మాలమహానడు రాష్ట్ర కార్యదర్శి అశోక్‌కుమార్ మాట్లాడుతూ చట్టాలను అమలు చేసి హక్కు పార్లమెంట్‌కు ఉందని, సుప్రీం కోర్టుకు లేదన్నారు. ప్రధానమంత్రి మోదీ సూచనలతో వర్గీకరణ రాష్ట్రాలు అమలు చేసుకోవచ్చు అని చెప్పడం సరికాదన్నారు. ఏపీలో మాలలు అధికంగా ఉన్నారని, మాలల జోలికి వస్తే పతనం ఖాయమన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసులు, నాగరాజ, ఆనంద్‌కుమార్, భాస్కర్, కమ్మిరెడ్డి, జెవి. నాగరాజ, సుమిత్రరమణ, నాగ, శంకర్, అజయ్, శంకర్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ తీర్పును వ్యతిరేకిస్తూ మాలమహానాడు ధర్నా

చౌడేపల్లె : ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ మాల మహానాడు నాయకులు బస్టాండ్ వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పుతో తాము తీవ్రంగా నష్టపోతామని, పీఎం మోదీ ప్రభావంతో తీర్పు ఇచ్చినట్లు ఉందన్నారు. అనంతరం తహసీల్దార్ హనుమంత్‌నాయక్‌కు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు మణి, రెడ్డిప్రసాద్, ఈశ్వర్, రాము, విజయ్, సురేష్‌రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రామకుప్పంలో దళిత నేతల నిరసన

రామకుప్పం, ఆగస్టు 21 : ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన ఎస్సీ వర్గీకరణ తీర్పును వెంటనే ఉపసంహరించుకోవాలని కోరుతూ బుధవారం రామకుప్పంలో దళిత సమైక్య సభ్యులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నిరసన తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సుప్రీంకోర్టులో అఫిడవిట్ వేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మండల దళిత సమైక్య సభ్యులు సతీష్, పెన్వెల్ సింహ, రమణ, విజయ్, జైకుమార్, మహేష్, గోవర్ధన్ తదితర సభ్యులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న దళిత నేతలు

వసతి గృహాలను బాధ్యతగా నిర్వహించాలి : అమర్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

పలమనేరు, ఆగస్టు21: సంక్షేమ వసతి గృహాలను బాధ్యతగా నిర్వహించాలని ఎమ్మెల్యే అమరనాథరెడ్డి సూచించారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన నియోజకవర్గ వసతిగృహ అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మెనూ మేరకు విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలన్నారు. విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలను కల్పించేందుకు చొరవ తీసుకోవాలన్నారు. విద్యార్థుల సంఖ్యను, సౌకర్యాల గురించి అడిగి తెలుసుకొన్నారు. కాగా పలువురు వసతిగృహ అధికారులు తాము వసతి గృహాలను అద్దె గృహాల్లో నడుపుతున్నామని, సొంత భవనాలు నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కొన్ని భవనాలు ఉరుస్తున్నందున వాటిని వెంటనే మరమ్మతులు చేయించాలని కొందరు కోరారు. సమావేశంలో ఎంపీడీవో రాజేష్, ఎంఈవో బాలసుందరం, ఏబీసీడబ్ల్యూవో జగ్గయ్య, ఏఎస్‌డబ్ల్యూవో బి.హేమావతి, నియోజకవర్గంలోని బీసీ, ఎస్సీ, వసతి గృహాల వార్డెన్లు పాల్గొన్నారు.

అక్రమ లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలకు అనుమతులివ్వం



కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డి

పుంగనూరు రూరల్, ఆగస్టు21: నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన అక్రమ లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు ఇచ్చేది లేదని మున్సిపల్ కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అక్రమ లేఅవుట్ల వల్ల ప్రభుత్వానికి వచ్చే ఆదాయానికి తీవ్ర నష్టం జరుగుతున్నట్లు తెలిపారు. మున్సిపల్ పరిధిలో 17 అక్రమ లేఅవుట్ల వేసినట్లు గుర్తించామన్నారు. మిగిలిన వాటిపై సర్వే చేసి నిషేధిత జాబితాలో చేర్చేందుకు జిల్లా అధికారులకు నివేదిక పంపుతున్నట్లు తెలిపారు. కుమ్మరవీధి, మేలుపట్ల, తాటిమాకులపాళ్యం, చదళ్లమిట్ట, రహమత్‌నగర్, బైపాస్ రోడ్డు, భగత్‌సింగ్‌కాలనీ, రాగానిపల్లెరోడ్డు, మినీబైపాస్‌రోడ్డు, వివేకనందకాలనీ, వనమలదిన్నె రోడ్డు, రామసముద్రంరోడ్డు, చెంగలాపురం వద్ద అనుమతులు లేకుండా లేఅవుట్లు గుర్తించినట్లు తెలిపారు. భూ యజమానులు ప్రభుత్వ అనుమతులు పొందిన తర్వాత విక్రయాలు చేసుకోవాలని సూచించారు. నింబంధలు ఉల్లఘించి విక్రయాలు చేస్తే కొనుగోలు దారుల నుంచి ఖాళీ జాగా పన్నులు, ఇళ్లనిర్మాణాల అనుమతులు, మౌలిక వసతులు కల్పించే ప్రసక్తే లేదని హెచ్చరించారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని, లేకపోతే కొనుగోలుదారులు తీవ్రంగా నష్టపోతారని ఆయన తెలిపారు. అక్రమ లే అవుట్లలో మున్సిపల్ అధికారులు బోర్డులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

కొళాయి కనెక్షన్ల కోసం వైసీపీ నేత అక్రమ వసూళ్లు

- డబ్బు వసూలు చేసి తప్పించుకుంటున్న వైనం
- సచివాలయంలో ఫిర్యాదు చేసిన బాధితులు



సచివాలయం వద్ద ఫిర్యాదు చేయడానికి వచ్చిన ప్రజలు

గంగవరం, ఆగస్టు 21: నీటి కొళాయి కనెక్షన్ల పేరుతో ప్రజల నుంచి డబ్బులు వసూలు చేసిన వైసీపీ నేత ఆ తర్వాత ఏమార్చిన ఘటనపై బాధిత ప్రజలు బుధవారం సచివాలయ అధికారులకు ఫిర్యాదు చేశారు. బాధితుల కథనం మేరకు, డ్రైవర్స్‌కాలనీలో ఉంటున్న వైసీపీకి చెందిన వార్డు మెంబర్ బాబు గత ప్రభుత్వంలో నీటి కొళాయిలు ఇప్పిస్తామని తమ దగ్గర స్థాయిని బట్టి రూ.5 వేలు, రూ.7వేలు, రూ.10 వేల చొప్పున డబ్బులు వసూలు చేశాడు. కనీసం తీసుకున్న డబ్బుకు రసీదు ఇవ్వకపోగా, కొళాయి కనెక్షన్ కూడా ఇవ్వక కాలయాపనచేస్తూ వస్తున్నాడని బాధితులు ఆరోపించారు. అధికారులు అతడిపై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని వినతిపత్రం అందించారు.

ఉపాధి పనులు కల్పించాలని కూలీల నిరసన



మండల పరిషత్ కార్యాలయం ఎదుట నిరసన

బైరెడ్డిపల్లె, ఆగస్టు 21 : మండలంలో ఉపాధి హామీ పథకం కింద కూలీలకు పనులు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఎస్సీ ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన పలువురు బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. రెండునెలలుగా ఉపాధి పనులు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వారు ఆవేదన వ్యక్తంచేశారు. దీని గురించి ఉపాధి సిబ్బందిని ప్రశ్నించినా సమాధానం చెప్పకుండా కాలయాపన చేస్తున్నార ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇప్పటికైనా ఉపాధి పనులు కల్పించాలని కోరుతూ ఎంపీడీవో రాజేంద్రబాలాజీకి వినతిపత్రం అందజేశారు. ఎంపీడీవో మాట్లాడుతూ ఈనెల 23వ తేది అన్ని గ్రామ పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహిస్తున్నామని, ప్రతి గ్రామంలోనూ ఉపాధిపనులు కల్పించడానికి శ్రద్ధ తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఎట్టకేలకు తగ్గువారిపల్లి దారి సమస్యకు పరిష్కారం



రెవెన్యూ సిబ్బందిని సన్మానిస్తున్న కాలనీవాసులు

బంగారుపాళ్యం, ఆగస్టు 21: తగ్గువారిపల్లి పంచాయతీ ఇందిరమ్మకాలనీవాసుల దారి సమస్య ఎట్టకేలకు పరిష్కారమైంది. కొన్నేళ్ళుగా గ్రామస్థులంతా దారి సమస్యపై కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఎమ్మెల్యే మురళీమోహన్, మండల టీడీపీ అధ్యక్షుడు ఎన్‌పీ జయప్రకాష్ ఎన్నికలకు ముందు దారి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. బుధవారం మండల టీడీపీ అధ్యక్షుడు జయప్రకాష్, ఉపసర్పంచ్ లోకనాథం నాయుడు, సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు హేమచంద్ర నాయుడులు తహసీల్దార్ బాబురాజేంద్రప్రసాద్‌తో చర్చించి దారి సమస్యను పరిష్కరించారు. దీంతో గ్రామస్థులు తహసీల్దార్‌తో పాటు సర్వేయర్ లావణ్య, వీఆర్వో రామకృష్ణ, నాయకులను సన్మానించారు.

కొనసాగుతున్న డెయిరీ కార్మికుల నిరసన

చిత్తూరు (సెంట్రల్), ఆగస్టు 21: వేతన బకాయిలు చెల్లించాలని కోరుతూ విజయా డెయిరీ కార్మికులు కలెక్టరేట్ ముందు చేపట్టిన నిరసన బుధవారానికి 344 రోజుకు చేరింది. కార్మిక నేత పీడీ కుమార్ మాట్లాడుతూ తమకు రావాల్సిన వేతన బకాయిల కోసం మూడు వారాల కిందట కలెక్టర్ సుమిత్ కుమార్, చిత్తూరు కోఆపరేటర్ అధికారికి సమస్యను వివరించినట్లు తెలిపారు. దీక్షలో కార్మికులు ఎబినేజర్, బాబాసాహెబ్, కరీం, భాస్కర్, రాజేంద్ర పాల్గొన్నారు.

'పీఎంకేవీవై'కి దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు : స్థానిక ప్రభుత్వ ఐటీఐలో ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన(పీఎంకేవీవై) పథకం కింద మూడు నెలల టెక్నికల్ కోర్సుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ రవీంద్రారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పాస్ లేదా ఫెయిల్ వారు కూడా అర్హులన్నారు. వయోపరిమితి లేదన్నారు. ఎలాంటి ఫీజులు లేదన్నారు. కోర్సులో చేరిన వారికి ఇంటి నుంచి ఐటీఐకి రావడానికి ఉచితంగా ఆర్టీసీ బస్ పాసు సౌకర్యం కల్పిస్తామన్నారు. ఎలక్ట్రికల్, సోలార్, కంప్యూటర్ కోర్సులపై శిక్షణ ఇస్తామన్నారు. ఇతర వివరాలకు 9160940479 నెంబరులో సంప్రదించాలని కోరారు.

నేడు డయల్ యువర్ ఎమ్మెల్యే

చిత్తూరు : నియోజకవర్గ పరిధిలో సమస్యల పరిష్కారం కోసం గురువారం డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కమిషనర్ అరుణ తెలిపారు. ఉదయం 10నుంచి 11గంటల మధ్య 9849907885 నెంబరుకు ఫోన్ చేసి సమస్యలు తెలియజేయవచ్చన్నారు.

నేటి నుంచి డిగ్రీ అడ్మిషన్లకు రిజిస్ట్రేషన్

వెదురుకుప్పం : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం నుంచి అడ్మిషన్లకు అవకాశం కల్పిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ అన్నపూర్ణశారద తెలిపారు. విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో కళాశాలకు హాజరైతే ఉచితంగానే రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పిస్తామన్నారు.

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

సాగులో డ్రోన్ వినియోగంపై అవగాహన



వెదురుకుప్పం, ఆగస్టు 21: వేరుశనగ సాగులో డ్రోన్ ద్వారా పురుగు మందులు చల్లడం, పోషకాల పిచికారీ చేయడంపై రైతులకు అవగాహన కల్పించారు. కృషి విజ్ఞాన కేంద్రం విస్తరణ శాస్త్రవేత్త రాంకుమార్, సేద్య విభాగ శాస్త్రవేత్త డాక్టర్ దివ్య బుధవారం రాజులకండ్రిగ, ఎం.కృష్ణాపురం, ఆర్కేవీబీపేట గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించారు. వీరు మాట్లాడుతూ డ్రోన్ సాంకేతికతతో కూలీల సమస్య పరిష్కారమవుతుందన్నారు. ఆరు నుంచి ఎనిమిది నిమిషాల్లో పది లీటర్ల నీటితో ఎకరాలో పిచికారీ చేయవచ్చన్నారు. పురుగు మందు మోతాదు 20 నుంచి 25 శాతం తగ్గుతుందన్నారు. పురుగు మందు ప్రభావం కూడా అధికంగా ఉంటుందన్నారు. 20 ఎకరాల్లో డ్రోన్ ద్వారా పిచికారి చేశామన్నారు. రైతు సమాఖ్య అధ్యక్షులు నగలపాటి నాగేశ్వరరాజు, రైతులు పాల్గొన్నారు.

పీఎంకేవీవైపై పథకానికి దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు, ఆగస్టు 21: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన(పీఎంకేవీవై) పథకం కింద మూడు నెలల టెక్నికల్ కోర్సుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ రవీంద్రారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పాస్ లేదా ఫెయిల్ వారు కూడా అర్హులన్నారు. వయోపరిమితి లేదన్నారు. ఎలాంటి ఫీజులు లేదన్నారు. కోర్సులో చేరిన వారికి ఇంటి నుంచి ఐటీఐకి రావడానికి ఉచితంగా ఆర్టీసీ బస్ పాసు సౌకర్యం కల్పిస్తామన్నారు. ఎలక్ట్రికల్, సోలార్, కంప్యూటర్ కోర్సులపై శిక్షణ ఇస్తామన్నారు. ఇతర వివరాలకు 9160940479 నెంబరును సంప్రదించాలని కోరారు.

వైద్యం వికటిస్తే ఆర్ఎంపీలపై కఠిన చర్యలు


ఆర్ఎంపీల సమావేశంలో సురేఖ

యాదమరి, ఆగస్టు 21: ఆర్ఎంపీలు ఫస్ట్ ఎయిడ్ చికిత్సలు మాత్రమే చేయాలని మండల వైద్యాధికారి డాక్టర్ సురేఖ స్పష్టం చేశారు. బుధవారం ఆమె ఆర్ఎంపీలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాల నేపథ్యంలో జ్వరాలు వచ్చే అవకాశం ఉందన్నారు. అలాంటప్పుడు ఆర్ఎంపీలు సూదులు వేయడం, మందులివ్వడాన్ని మానుకోవాలన్నారు. జ్వరబాధితులు వస్తే యాదమరి పీహెచ్‌సీకి పంపాలని సూచించారు. కొందరు చిన్నపిల్లలకు వైద్యం చేస్తున్నారన్నారు. వైద్యం వికటిస్తే క్లినిక్‌ను మూసేయడంతో పాటు సంబంధిత ఆర్ఎంపీని జైలుకు పంపుతామని హెచ్చరించారు. సీహెచ్‌వో లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

సర్పంచులు,కార్యదర్శులకు ముగిసిన శిక్షణ


విజయపురంలో శిక్షణకు హాజరైన సర్పంచులు

విజయపురం, ఆగస్టు 21: మండల కేంద్రంలో మూడు రోజుల పాటు సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు నిర్వహించిన శిక్షణ బుధవారం ముగిసింది. ఉన్న వనరులతో పంచాయతీలను ఎలా అభివృద్ధి చేసుకోవచ్చునో ఎంపీడీవో చంద్రమౌళి వివరించారు. పంచాయతీలకు కావలసిన నిధుల వివరాలను తీర్మానం ద్వారా తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ సురేంద్ర కుమార్, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు పాల్గొన్నారు.

విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ



విజయపురం, ఆగస్టు 21: క్షూరికాపురం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు రిటైర్డు ప్రధానోపాధ్యాయులు చంద్రయ్య బుధవారం విద్యా సామగ్రి పింపిణీ చేశారు. ఒకటి నుండి ఐదు తరగతుల వరకు విద్యార్థులకు పెన్నులు, పెన్సిల్, నోటు పుస్తకాలు వితరణ చేశారు. ప్రధానోపాధ్యాయులు రత్నమ్మ, ఉపాధ్యాయులు, ఎస్ఎంసీ సభ్యులు పాల్గొన్నారు.

యువతను ఓటరుగా నమోదు చేయించాలి


మాట్లాడుతున్న అరుణకుమారి

పాలసముద్రం, ఆగస్టు 21: 18 ఏళ్ళు నిండిన యువతను ఓటరుగా నమోదు చేయించాల్సిన బాధ్యత బీఎల్వోలపై ఉందని తహసీల్దార్ అరుణకుమారి అన్నారు. బుధవారం తమ కార్యాలయంలో ఆమె బీఎల్వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అరుణకుమారి మాట్లాడుతూ బీఎల్వోలు ఇంటింటికీ తిరిగి ఓటర్ల నమోదు, తప్పొప్పుల సవరణ, ఒకే వ్యక్తికి రెండు ఓట్లు ఉన్నా, ఓటరు మరణిస్తే ఓట్ల తొలగింపులాంటి చర్యలు చేపట్టాలన్నారు. డీటీ మధుబాబు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం



చిత్తూరు రూరల్, ఆగస్టు 21: స్థానిక సంతపేటలో మాతృసేవా సమితి వృద్ధాశ్రమంలో బుధవారం ప్రపంచ వృద్ధుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నగరానికి చెందిన మాజీ కౌన్సిలర్ పార్థసారథి నాయుడు ఆశ్రమంలో కేక్ కట్ చేసి వృద్ధులకు పంచిపెట్టారు. అనంతరం ఆయన అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకుడు కరుణాకరన్, దేవి తదిరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు తగ్గువారిపల్లి దారి సమస్యకు పరిష్కారం


రెవెన్యూ సిబ్బందిని సన్మానిస్తున్న కాలనీవాసులు

బంగారుపాళ్యం, ఆగస్టు 21: తగ్గువారిపల్లి పంచాయతీ ఇందిరమ్మకాలనీ వాసులు దారి సమస్య ఎట్టకేలకు పరిష్కారమైంది. కొన్నేళ్ళుగా గ్రామస్తులంతా దారి సమస్యపై కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఎన్నికలకు ముందు ఎమ్మెల్యే మురళీమోహన్, మండల టీడీపీ అధ్యక్షుడు ఎన్‌పీ జయప్రకాష్‌లు దారి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. బుధవారం మండల టీడీపీ అధ్యక్షుడు జయప్రకాష్, ఉపసర్పంచ్ లోకనాథం నాయుడు, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు హేమచంద్ర నాయుడులు తహసీల్దార్ బాబు రాజేంద్రప్రసాద్‌తో చర్చించి దారి సమస్యను పరిష్కరించారు. దీంతో గ్రామస్థులు తహసీల్దార్‌తో పాటు సర్వేయర్ లావణ్య, వీఆర్వో రామక్రిష్ణ, నాయకులను సన్మానించారు.

కొత్తగా కౌన్సెలింగ్ నిర్వహించాలి : యూటీఎఫ్

చిత్తూరు (సెంట్రల్), ఆగస్టు 21: నిబంధనలకు విరుద్ధంగా జరిపిన వర్క్ అడ్జెస్ట్‌మెంట్‌ను రద్దు చేసి కొత్తగా కౌన్సెలింగ్ నిర్వహించాలని యూటీఎఫ్ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం డీఈవో దేవరాజును కలిసి వర్క్ అడ్జెస్ట్‌మెంట్ ప్రక్రియలోని లోపాలను వివరించారు. ఒక్కో మండలంలో ఒక్కో రకంగా చేపట్టడంతో పారదర్శకత లోపిస్తోందన్నారు. ఎస్టీటీలను బలవంతంగా ఉన్నత పాఠశాలకు పంపడం సరికాదన్నారు. డీఈవోను కలిసిన వారిలో యూటీఎఫ్ నాయకులు సుధాకర్‌రెడ్డి, రెహనాబేగం, కృష్ణమూర్తి, రెడ్డెప్ప, బాషా తదితరులు ఉన్నారు.

కుంభాభిషేకంలో ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్


స్వాగతం పలుకుతున్న గ్రామస్తులకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

నగరి, ఆగస్టు 21: పట్టణ పరిధిలోని చింతలపట్టెడలో జరుగుతున్న పొన్నియమ్మాన్ ఆలయంలో కుంభాభిషేకంలో ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ బుధవారం పాల్గొన్నారు. అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. వేద పండితుల ఆశీర్వాదం పొందారు. గ్రామస్తులు ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు రమేష్‌బాబు, కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు గుణశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ ఎమ్మెల్యే

చిత్తూరు, ఆగస్టు 21: నియోజకవర్గ పరిధిలో సమస్యల పరిష్కారం కోసం గురువారం డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కమిషనర్ అరుణ తెలిపారు. ఉదయం 10 నుంచి 11 గంటల మధ్య 9849907885 నెంబరుకు ఫోన్ చేసి సమస్యలను తెలియజేయవచ్చన్నారు. చిత్తూరు రూరల్, గుడిపాల మండలాలతో పాటు నగరపాలక సంస్థ అధికారులందరూ హాజరుకావాలన్నారు.

రైల్వేస్టేషన్‌ను తనిఖీ చేసిన డీఎస్పీ

చిత్తూరు రూరల్, ఆగస్టు 21: ఎస్సీ నాయకుల భారత్ బంద్ పిలుపు నేపథ్యంలో చిత్తూరులో రైళ్ల రాకపోకలకు అంతరాయ ఏర్పడకుండా రైల్వే డీఎస్పీ హర్షిత చిత్తూరు రైల్వేస్టేషన్‌ను బుధవారం తనిఖీ చేశారు. స్టేషన్‌లో బందోబస్తులో ఉన్న పోలీసులకు సూచనలు చేశారు. ఆర్‌పీఎఫ్ సీఐ కోటేశ్వరరావు, ఎస్ఐ ప్రవీణ్ ఉన్నారు.

కొనసాగుతున్న డెయిరీ కార్మికుల నిరసన



చిత్తూరు (సెంట్రల్), ఆగస్టు 21: వేతన బకాయిలు చెల్లించాలని కోరుతూ విజయా డెయిరీ కార్మికులు కలెక్టరేట్ ముందు చేపట్టిన నిరసన బుధవారానికి 344 రోజుకు చేరింది. కార్మికులు పీడీ కుమార్ మాట్లాడుతూ తమకు రావాల్సిన వేతన బకాయిల కోసం పోరాడుతున్నామన్నారు. మూడు వారాల కిందట కలెక్టర్ సుమిత్ కుమార్, చిత్తూరు కోపరేటివ్ అధికారికి సమస్యను వివరించినట్లు తెలిపారు. దీక్షలో కార్మికులు ఎబినేజర్, బాబాసాహెబ్, కరీం, భాస్కర్, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ నగర ప్రధాన కార్యదర్శిగా రేఖ

చిత్తూరు (సెంట్రల్), ఆగస్టు 21: పీఆర్‌టీయూ నగర ప్రధాన కార్యదర్శిగా గాండ్లపల్లి మున్సిపల్ ఉన్నత పాఠశాలలో తెలుగు పండిట్ కేబీ రేఖను ఎన్నుకున్నట్లు ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిరిప్రసాద్ తెలిపారు. బుధవారం స్థానిక గిరింపేట మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో పీఆర్‌టీయూ పట్టణ శాఖ కార్యవర్గ సమావేశం జరిగింది. మహిళా విభాగం కార్యదర్శిగా అనూష, సహాయ కార్యదర్శులుగా బి.శారద, యువరాజ్, ఆనంద్, ఉపాధ్యక్షులుగా ఎ.ఉష, సుధీర్, యుగంధర్, ఐజీ రెడ్డి, నాగరాజు, కోశాధికారిగా ఎస్.సురేంద్రరెడ్డిని ఎన్నుకున్నట్లు తెలిపారు. వెంకటేశ్వర్లు, వేణుగోపాల్, ఏకాంబరం, విజయలక్ష్మి, జ్యోతి, ప్రమిల పాల్గొన్నారు.

నేటి నుంచి డిగ్రీ అడ్మిషన్లకు రిజిస్ట్రేషన్

వెదురుకుప్పం, ఆగస్టు 21: వెదురుకుప్పం వైఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం నుంచి అడ్మిషన్లకు అవకాశం కల్పిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.అన్నపూర్ణశారద తెలిపారు. విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో కళాశాలకు హాజరైతే ఉచితంగానే రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పిస్తామన్నారు. ఈ ప్రక్రియ ఈనెల 24తో ముగుస్తుందన్నారు.

రేపు గంగాధర నెల్లూరు మండల మీట్

గంగాధరనెల్లూరు, ఆగస్టు 21: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం ఉదయం 10గంటలకు ఎంపీపీ అనిత అధ్యక్షతన జరుగుతుందని ఇన్‌చార్జి ఎంపీడీవో రాఘవేంద్రరాజు తెలిపారు. గత సమావేశంలో సభ్యులు ప్రస్తావించిన సమస్యలపై తీసుకున్న చర్యల వివరాలను ముందుగా నివేదించాలని అధికారులను కోరారు.

డీసీసీబీ మహాసభ వాయిదా

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 21: ఈనెల 23న జరగాల్సిన జిల్లా సహకార కేంద్ర బ్యాంకు(డీసీసీబీ) మహాజన సభ ఈనెల 23న అనివార్య కారణాలతో వాయిదా పడింది. బ్యాంకు సీఈవో మనోహర్ గౌడ్ బుధవారం ఈమేరకు ఒక ప్రకటనలో తెలిపారు. మహాజనసభ జరిగే తదుపరి తేదీని త్వరలో తెలియజేస్తామన్నారు.

24,25 తేదీల్లో అండర్ 14 బాలుర క్రికెట్ ఎంపిక పోటీలు

చిత్తూరు క్రీడలు, ఆగస్టు 21: చిత్తూరు ఉమ్మడి జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 24, 25 తేదీల్లో అండర్-14 బాలుర క్రికెట్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ నాయకులు తెలిపారు. సెప్టెంబర్ 2010 జనవరి 1వ తేదీ తర్వాత జన్మించిన వారు అర్హులన్నారు. 24న పుత్తూరులోని ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో, శ్రీకాళహస్తి కేసీసీ క్రికెట్ నెట్స్‌లో, పీలేరు పీఐఓసీ క్రికెట్ అకాడమీ, భువన విద్యాలయంలో, వాల్మీకిపురంలో జీవీఎస్‌సీఎస్ క్రికెట్ గ్రౌండ్స్‌లో ఎంపిక పోటీ జరుగుతుందన్నారు. 25న తిరుపతిలోని సీవీ క్రికెట్ అకాడమీ, చిత్తూరులోని పోలీస్ గ్రౌండ్‌లో, పలమనేరులోని ప్రభుత్వ డీగ్రీ కళాశాలలో, వీకోటలోని జీఎంఆర్ క్రికెట్ అకాడమీలో జరుగుతుందన్నారు. ఇతర వివరాలకు 9000214966, 888618559 నంబర్లలో సంప్రదించాలన్నారు.


కాలేజీల వద్ద భద్రత ఏర్పాటుకు వినతి


ఎస్పీని సన్మానిస్తున్న వైపీ రాజేశ్వరి

చిత్తూరు సిటీ, ఆగస్టు 21: నగరంలోని కాలేజీల వద్ద పోలీసు భద్రత ఏర్పాటు చేయాలని టీడీపీ రాష్ట్ర తెలుగుమహిళ ఉపాధ్యక్షురాలు వైపీ రాజేశ్వరి కోరారు. బుధవారం ఆమె ఎస్పీ మణికంఠను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా కొన్ని సమస్యలను ఎస్పీ దృష్టికి తీసుకువెళ్ళారు. అన్ని కళాశాలల వద్ద ఉదయం, సాయంత్రం పోలీసు భద్రత ఏర్పాటు చేయాలని కోరారు. గంజాయి, అక్రమ మద్యం, పేకాట తదితర అసాంఘిక కార్యక్రమాలను అరికట్టాలని కోరారు.

'నీరు'గారుతున్న లక్ష్యం

- అధ్వాన స్థితికి చేరుకున్న నీటిట్యాంక్
- లోపల పెచ్చులూడుతున్న సీలింగ్ భాగం



ట్యాంకు సగభాగంలో నెర్రెలు - ట్యాంక్‌లోపల సీలింగ్‌కు సిమెంట్ పెచ్చులూడి ఇలా..

గంగాధరనెల్లూరు, ఆగస్టు 21: మండలంలోని క్రిష్ణంపల్లెలోని తాగునీటి ట్యాంక్ పరిస్థితి అధ్వానంగా మారింది. సుమారు 25 ఏళ్ళ క్రితం సత్య సాయి ట్రస్ట్ తరఫున 10వేలు లీటర్ల నీటిసామర్థ్యం కలిగిన తాగునీటి ట్యాంక్‌ను నిర్మించారు. ట్యాంక్ నుంచి క్రిష్ణంపల్లెకు, మిట్టఇండ్లుకు నీరు సరఫరా చేస్తున్నారు. పదేళ్లుగా ఈ ట్యాంక్ పరిస్థితి పాడైంది. లోపలి భాగంలో సిమెంట్ పెచ్చులు ఊడిపోతున్నాయి. కమ్మీలు కనిపిస్తూ ఆందోళన కలిగిస్తున్నాయి. ట్యాంక్ చుట్టు పైభాగంలో నెర్రెలు చీలిపోయి నీరు ఎక్కించినపుడు ఇబ్బంది కలుగుతోంది. రోజూ లీకేజితో నీరు వృధాగా పోతోందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. స్థానికులు చొరవ తీసుకుని ట్యాంక్‌ను శుభ్రం చేయించడానికి పిలిచినా ఎవరూ ఆసక్తి చూపడంలేదు. ట్యాంక్ సీలింగ్ కూలిపోతుందని భయపడుతున్నారు. బయట భాగం బాగానే ఉన్నట్లు కనిపిస్తోంది. ప్రమాదకరంగా మారిన తాగునీటి ట్యాంక్‌ను తొలగించి మరోచోట 20వేల లీటర్ల నీటి కెపాసిటీ గల కొత్త ట్యాంక్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పంట వివరాల నమోదుతో రైతుకు ప్రయోజనం


పంటను పరిశీలిస్తున్న మురళీకృష్ణ

యాదమరి, ఆగస్టు 21: ప్రతి రైతు తమ సాగు వివరాలను వ్యవసాయశాఖ కార్యాలయంలో నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ సూచించారు. పంట నష్టం జరిగినప్పుడు దీనివల్ల పెట్టుబడి రాయితీ పొందే అవకాశం ఉంటుందన్నారు. బుధవారం కాశిరాళ గ్రామ రైతు సేవా కేంద్రంలో ఈ-పంట నమోదు, ఏపీఎంఐపీ, డ్రిప్ ఇరిగేషన్, ఐదేళ్లుగా సాగు చేయని భూముల గుర్తింపు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటను విధిగా రైతులు నమోదు చేసుకోవాలన్నారు. లేకుంటే బీమా పొందే అవకాశం ఉండదన్నారు. పంటపై రుణం తీసుకోవచ్చన్నారు. మైక్రో ఇరిగేషన్ పథకం కింద అర్హులైన రైతులందరూ డ్రిప్ ఇరిగేషన్ కోసం నమోదు చేసుకోవచ్చన్నారు. ఐదు ఎకరాల లోపు ఉన్న రైతుకు 90శాతం రాయితీ, పది ఎకరాల లోపు ఉన్న రైతుకు 70 శాతంరాయితీ, ఆపై ఉన్న భూములుంటే 50 శాతం రాయితీ ఉంటుందన్నారు. వ్యవసాయ సహాయ సంచాలకులు ఉమా, చరిత తదితరులు పాల్గొన్నారు.

దేవదాయ భూమిలో ఆక్రమణల తొలగింపు


పొన్నయమ్మగుడి వీధిలో ఆక్రమణల తొలగింపు

చిత్తూరు కల్చరల్, ఆగస్టు 21: స్థానిక ఆర్టీసీ డిపో రోడ్డు కన్నయ్యనాయుడు వీధిలో దేవదాయశాఖకు చెందిన భూమికి ఆక్రమణ చెర నుంచి విముక్తి కలిగింది. వివరాలివి. నగరంలోని పొన్నయమ్మగుడి వీధిలో వీరాంజనేయస్వామి ఆలయానికి చెందిన 17 సెంట్ల భూమి ఆక్రమణదారుల పరమైంది. ఈ స్థలం స్వాధీనానికి జిల్లా దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనరు ప్రసన్నలక్ష్మి ఆధ్వర్యంలో బుధవారం గట్టి పోలీస్ బందోబస్తు మధ్య చర్యలు తీసుకున్నారు. ఆక్రమణలను తొలగించారు. ఈవోలు తిమ్మారెడ్డి,మునిశేఖర్, సుబ్రమణ్యంనాయుడు, ఇన్‌స్పెక్టర్ సుమనప్రియతోపాటు రెవెన్యూ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. 20 ఏళ్లుగా దురాక్రమణకు గురైన ఆలయ భూముల విలువ దాదాపు రూ.30 కోట్లు ఉంటుందని దేవదాయశాఖ అధికారుల అంచనా. ఓవర్‌బ్రిడ్జి ఆనుకుని దేవదాయశాఖ పరిధిలో జీవకారుణ్య అన్నదాన సమాజానికి చెందిన 3.33 ఎకరాల భూమిలో ముళ్ళ కంపలను తొలగించారు. ఆక్రమణకు గురికాకుండా చుట్టూ కంచె ఏర్పాటు చేశారు.

సర్వీసు రోడ్డు ఏర్పాటు చేయాలని రైతుల ధర్నా



నింద్ర, ఆగస్టు 21: బెంగళూరు-తచ్చూర్ హైవే రోడ్ నిర్మాణంలో సర్వీసు రోడ్డు లేక పోవడంతో ఇబ్బందులకు గురవుతున్నామని ఓరూరు గ్రామస్థులు బుధవారం ధర్నా నిర్వహించారు. నిర్మాణ పనుల్లో పాల్గొనే వాహనాలను నిలిపివేశారు. రైతులు మాట్లాడుతూ గొల్లకండ్రిగ వద్ద నిర్మించిన బ్రిడ్జి ఎత్తు లేకపోవడం, అడ్డుగోడలు ఏర్పాటు చేయడం వలన పంట తరలింపునకు యాతనగా ఉందన్నారు. సర్వీసు రోడ్డు ఏర్పాటు చేయకపోతే జీవనాధారం కోల్పోతామన్నారు.

ఇన్‌స్పైర్ మనక్ నామినేషన్లపై టీచర్లకు శిక్షణ



వెదురుకుప్పం, ఆగస్టు 21: ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని జిల్లా సైన్స్ అధికారి ఆర్వీ రమణ తెలిపారు. బుధవారం ఇన్‌స్పైర్ మనక్ నామినేషన్లపై కార్వేటినగరం ఆర్కేఎస్ఆర్ హైస్కూల్‌లో ఇన్‌స్పైర్ గైడ్ టీచర్లకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎక్కువ నామినేషన్లు ఉండేలా చూడాలన్నారు. ప్రతీ ఉన్నత పాఠశాల నుంచి ఐదు, ప్రాథమికోన్నత పాఠశాల నుంచి మూడు నామినేషన్లు సెప్టెంబరు 15వ లోపు అప్‌లోడ్ చేయాలన్నారు. డీఈవో దేవరాజు, ఎంఈవో మంచికాయల విజయకుమార్, డైట్ లెక్చరర్ తిరుమలరాజు, ఆర్పీలు నందకుమార్, ఉమాశంకర్, భవాజాన్, శివలింగం పాల్గొన్నారు.

తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకుందాం


సీఆర్‌రాజన్, దొరబాబులను సన్మానిస్తున్న తులసీనాథం నాయుడు

చిత్తూరు సిటీ, ఆగస్టు21: తెలుగుభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకుందామని తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షుడు తులసినాథం నాయుడు అన్నారు. బుధవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో పార్టీ చిత్తూరు పార్లమెంటు అధ్యక్షుడు సీఆర్ రాజన్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబును దుశ్శాలువ,పుష్పగుచ్ఛం, తెలుగుతల్లి జ్ఞాపికను ఇచ్చి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 29న తెలుగుభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని కోరారు. తెలుగు భాష పరిరక్షణకు, తెలుగు వారందరూ కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో ఎన్‌పీ జయప్రకాష్ నాయుడు, సుధాకర్, యుగంధర్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

రైతులకు నష్టపరిహారం అందిస్తాం: ఆర్డీవో హామీ

బంగారుపాళ్యం, ఆగస్టు 21: చెన్నై-బెంగళూరు ఎక్స్‌ప్రెస్ హైవేలో మొగిలి, మొగిలివారిపల్లి, గౌరిశంకరాపురం, జయంతి గ్రామాల నిర్వాసిత రైతుల పరిహారంపై కలెక్టర్‌తో చర్చించి ఆదుకుంటామని ఆర్డీవో మనోజ్‌కుమార్ రెడ్డి చెప్పారు. బుధవారం బంగారుపాళ్యం తహసీల్దార్ కార్యాలయంలో రైతులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చెట్లు, భూములు కోల్పోయిన రైతులకు తగిన నష్టపరిహారం చెల్లిస్తామన్నారు. తహసీల్దార్ బాబురాజేంద్రప్రసాద్, సర్వేయర్ లావణ్య, వీఆర్వోలు పాల్గొన్నారు.


చిత్తూరు అపోలో యూనివర్సిటీలో బుధవారం ఫుడ్ పాయిజన్ కారణంగా అస్వస్థతకు గురై చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి ప్రభావతి -చిత్తూరు

ఘనంగా కుంభాభిషేక వార్షికోత్సవం

చిత్తూరు కల్చరల్, ఆగస్టు 21: గిరింపేట సీబీ రోడ్డులోని వీరాంజనేయస్వామి ఆలయ మహా కుంభాభిషేక వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ నాయుడు,కటారి హేమలత, ఏ.ఎస్. మనోహర్, మేయర్ అముదలు పాల్గొని స్వామివారికి పూజలు చేశారు. ఈ సందర్భంగా స్వామివారికి అభిషేకం, హోమం, పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. విశేష అలంకారంలో భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు.

కర్తవ్య నిర్వహణే లక్ష్యం

చిత్తూరు కల్చరల్, ఆగస్టు 21: రాగద్వేషాలకు అతీతంగా వ్యవహరించి అనుకున్న లక్ష్యాలు సాధించడానికి భగవద్గీత చక్కటి ఉదాహరణ అని ఆధ్యాత్మిక ప్రవచన ఉపన్యాసకురాలు శ్రేయానంద చిన్మాయానంద అన్నారు. నాలుగు రోజులుగా నగరంలోని సద్గురు ఆశ్రమంలో ఆమె గీతాజ్ఞానయజ్ఞ ఉపన్యాసం చేస్తున్నారు. బుధవారం జరిగిన కార్యక్రమంలో అమె ప్రవచిస్తూ ప్రతి పనికీ ఒక ఫలితం ఉంటుందన్నారు. వివేకంతో ఆలోచించి పనులను చక్కబెట్టాలన్నారు. సమాజ గౌరవాలను గుర్తెరిగి వ్యవహరించి కర్తవ్యాలను నెరవేర్చడమే భగవద్గీత ఉపదేశమన్నారు. కార్యక్రమంలో పరబ్రహ్మ స్వామి, రఘుపతి, కేశవులు, బాబు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

25, 26 తేదీల్లో కాళభైరవాష్టమి పూజలు

చిత్తూరు కల్చరల్, ఆగస్టు 21: స్థానిక కామాక్షి అంబికా సమేత అగస్తీశ్వరాలయంలో ఈనెల 25, 26తేదీల్లో కాళభైరవ ట్రస్టు ఆధ్వర్యంలో కాళభైరవాష్టమి పూజలు నిర్వహిస్తున్నట్లు సంస్థ నిర్వాహకులు వెంకటేశన్ తెలిపారు. 25న కలశస్థాపన, 26న అభిషేకం నిర్వహిస్తున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు

ఎస్ఐల బాధ్యతల స్వీకారం


రాజ్‌కుమార్- నరసింహులు

వెదురుకుప్పం, ఆగస్టు 21: కార్వేటినగరం ఎస్ఐగా పి.రాజ్‌కుమార్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకూ ఆయన తిరుపతి సీఐడీ ఎస్ఐగా పనిచేశారు. ఈ సందర్భంగా ఆయనను స్టేషన్ సిబ్బంది అభినందించారు. **ఐరాల:** స్థానిక ఎస్ఐగా నరసింహులు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ నేరాలకు సంబంధించి లేదా సమాచారం తెలిస్తే 9440796722కి ఫోన్ చేసి తెలియజేయవచ్చునన్నారు.

1104 యూనియన్ డివిజన్ కార్యవర్గం ఎన్నిక

చిత్తూరు రూరల్, ఆగస్టు 21: చిత్తూరు ఆపరేషన్ డివిజన్ 1104 యూనియన్ డివిజన్ కార్యవర్గం ఎన్నిక బుధవారం స్థానిక గాంధీ రోడ్డులోని విద్యుత్ శాఖ కార్యాలయంలో నిర్వహించారు. డివిజన్ అధ్యక్షుడుగా శ్రీరాములు, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా మధు, కార్యదర్శిగా గోవిందన్, సంయుక్త కార్యదర్శి మురుగేసులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు గోవిందరాజులు, సత్య పాల్గొన్నారు.

ఫుడ్ ప్రాసెసింగ్ క్లసర్ల ఏర్పాటు ఉపయోగకరం

చిత్తూరు (సెంట్రల్), ఆగస్టు 21: ఫుడ్ ప్రాసెసింగ్ క్లస్టర్ల ఏర్పాటు మైక్రో స్మాల్ మీడియం ఎంటర్‌ప్రెన్యూర్ (ఎంఎస్ఎంఈ)లకు లాభసాటిగా ఉంటుందని ఏపీ ఎస్ఈసీఎం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టీవీవీ శివరామకుమార్ అన్నారు. బుధవారం స్థానిక మ్యాంగో భవన్‌లో ఎంఎస్ఎంఈలతో వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక సాంకేతికత పద్ధతుల ద్వారా యూనిట్లు ఏర్పాటు చేసుకుని వివిధ రకాలైన పండ్లతో ఆహార ఉత్పత్తులు చేసుకోవడం లాభసాటిగా ఉంటుందన్నారు. ఎంఎస్ఎంఈలు ఈ దిశగా ప్రోత్సహించడానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. చిత్తూరు ఫ్రూట్స్ ప్రాసెసర్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి గోవర్ధన్ బాబీ, చీఫ్ కన్సల్టెంట్ శ్రీనివాసరావు, కన్సల్టెంట్ సుదీప్, అఫిట్ కో కన్సల్టెంట్ గోపాలరావు పాల్గొన్నారు.

గుండెపోటుతో టీడీపీ కార్యకర్త మృతి

గుడిపాల, ఆగస్టు 21: చెరుకూరుకండ్రిగకు చెందిన టీడీపీ కార్యకర్త నవీన్‌కుమార్ (47) బుధవారం గుండెపోటుతో మృతిచెందారు. ఈయన మృతికి జీజేఎం ఛారిటబుల్ ఫౌండేషన్ నిర్వాహకులు చెన్నకేశవులు నాయుడు, మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, మాజీ జడ్పీటీసీ బాలాజీనాయుడులు సంతాపం ప్రకటించారు.

దళితవాడలో ప్రత్యేక వైద్యశిబిరం

గంగాధరనెల్లూరు, ఆగస్టు 21: కడపగుంట పంచాయతీ మూర్తినాయనిపల్లె దళితవాడలో గంగాధరనెల్లూరు పీహెచ్‌సీ డాక్టర్ దుర్గాదేవి ఆధ్వర్యంలో బుధవారం వైద్యశిబిరం నిర్వహించారు. జ్వర బాధితులకు మందులు అందజేశారు.

ముగిసిన సర్పంచుల శిక్షణ

వెదురుకుప్పం, ఆగస్టు 21: సర్పంచులు, గ్రామ కార్యదర్శులు మూడు రోజుల పాటు శిక్షణ తరగతుల్లో తెలుసుకున్న వాటిని పంచాయతీల్లో అమలు పరచాలని ఎంపీడీవో కె.హరినాథ్‌బాబు బుధవారం కోరారు. మూడు రోజులపాటు మండలకేంద్రంలో జరిగిన శిక్షణ తరగతులు బుధవారంతో ముగిశాయి.

దారి నిర్మించలేదని హైవే అధికారులపై గ్రామస్తుల ఆగ్రహం

గుడిపాల, ఆగస్టు 21: తమ గ్రామానికి సరైన దారి నిర్మించలేదంటూ హైవే అధికారులపై చలిచీమలపల్లి గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆరులేన్ల విస్తరణలో భాగంగా మార్గం లేకుండా చేశారని బుధవారం వారు అధికారులను నిలదీశారు. ఈదశలో పోలీసులు జోక్యం చేసుకుని హైవే అధికారులు, గ్రామస్తులతో చర్చించారు. దారి సమస్య పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో గ్రామస్తులు శాంతించారు.

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా దళిత సంఘాల నిరసన


చింతమండి వద్ద జాతీయ రహదారిపై రాస్తారోకో

నగరి, ఆగస్టు 21: ఎస్సీ కుల వర్గీకరణకు వ్యతిరేకంగా పట్టణంలో జై భీమ్ సేన ఆధ్వర్యంలో బంద్ పాటించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల జూనియర్ కళాశాల మూసివేశారు. అంబేడ్కర్ విగ్రహం వద్ద నుంచి ర్యాలీ నిర్వహించారు. జై భీమ్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రన్, వీపీసీ ప్రధాన కార్యదర్శి బాబు, దళిత నాయకులు కుమార్, గజేంద్రన్, సెల్వం, రజని, రత్నం, శశికుమార్ తదితరులు పాల్గొన్నారు. **బంగారుపాళ్యం:** ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపాన అంబేడ్కర్ విగ్రహం వద్ద దళిత నాయకులు నిరసన వ్యక్తం చేశారు. జాతీయ రహదారిపై బైఠాయించారు. **వెదురుకుప్పం:** కార్వేటినగరం మండల కేంద్రంలోని గాండ్ల మిట్ట కూడలి, వేణుగోపాలస్వామి ఆలయం ఎదురుగా జాతీయ రహదారిపై, చింతమండి వద్ద, తురకమిట్ట ప్రాంతాల్లో రోడ్లపై బైఠాయించారు. రాస్తారోకోతో వాహన రాకపోకలు నిలిచిపోయాయి. తహసీల్దార్ భగవతికి దళిత నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు. రాస్తారోకో నేపథ్యంలో చింతమండి, కార్వేటినగరం వేణుగోపాలస్వామి ఆలయం ఎదుట 104 వాహనం బుధవారం ఇరుక్కుపోయింది. రాస్తారోకో విరమణతో ముందుకు సాగింది. **గంగాధరనెల్లూరు:** చిత్తూరు-పుత్తూరు రహదారిపై దళిత యువకులు రాస్తారోకో చేశారు. **శ్రీరంగరాజపురం:** స్థానికంగా చిత్తూరు-పుత్తూరు జాతీయ రహదారిపై దళితనేతలు నిరసన వ్యక్తం చేశారు.